

కస్తూర్బా బాలికలతో కలెక్టర్ భోజనం

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మంగళవారం దేవరాపల్లి మండలం బేతపూడిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. పదవ తరగతి బాలికల నైపుణ్యాలను పరీక్షించారు. ఎటువంటి ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలను ప్రశాంతంగా రాయాలని సూచించారు. అనంతరం బాలికలతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, అనకాపల్లి ఆర్డీవో ఆయీషా, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



బేతపూడి కేజీబీవీలో బాలికలతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

క్రిస్మస్‌కు చర్చిలు ముస్తాబు



నర్సీపట్నంలో విద్యుద్దీపాలతో అలంకరించిన ఆంధ్రా బాప్టిస్ట్ క్రైస్ట్ చర్చి

క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని జిల్లాలోని అన్ని చర్చిలను మంగళవారం రాత్రి రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. క్రీస్తు జననానికి సంబంధించిన ముఖ్య ఘట్టాలను తెలిపే బొమ్మలు, క్రిస్మస్ ట్రీ, శాంతాక్లాజ్‌ల వేషధారణలో ముస్తాబు చేశారు. క్రైస్తవులు నగర సంగీర్తన(కెరల్స్) నిర్వహించి క్రీస్తు జన్మదిన గీతాలను ఆలపించారు. క్రీస్తు జననం సందర్భంగా బాల యేసు రాకడను స్వాగతిస్తూ అర్ధరాత్రి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిల ఫాదర్లు, పాస్టర్లు క్రీస్తు జననం గురించి సందేశాలు అందించారు.



అనకాపల్లిలో విద్యుత్ దీపాల అలంకరణలో పునీత పౌలుకతోలిక దేవాలయం

వైసీపీ నిర్లక్ష్యం..పేదలకు శాపం!

సొంతగూటికి నోచుకోని టిడ్కో లబ్ధిదారులు

- గత టీడీపీ హయాంలో పట్టణ పేదలకు గృహ సముదాయాల నిర్మాణం
- పనులు చివరిదశలో ఉండగా మారిన ప్రభుత్వం
- నాలుగేళ్ల వరకు పట్టించుకోని వైసీపీ పాలకులు
- భవనాలకు సొంత పార్టీ రంగులు
- గత ఏడాది అరకొరగా పనులు
- ఎన్నికల్లో లబ్ధి కోసం హడావిడిగా లబ్ధిదారులకు ఇళ్లు పంపిణీ
- మౌలిక వసతులు లేకపోవడంతో ఇబ్బందులు
- పలు కాలనీల్లో ఒక్కరు కూడా నివాసం ఉందని వైనం

ఆంధ్రజ్యోతి పరిశీలన



అనకాపల్లి మండలం సత్యనారాయణపురం టిడ్కో కాలనీలో పెరిగిపోయిన తుప్పలు

అనకాపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): **జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో సొంత గూడు లేని నిరుపేదల కోసం నిర్మించిన టిడ్కో ఇళ్లు నిరుపయోగంగా పడివున్నాయి. ఆరేళ్ల క్రితం నిర్మాణ పనులు చేపట్టగా, గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో గృహ సముదాయాలు ఇంతవరకు అందుబాటులోకి రాలేదు. గత టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లకు వైసీపీ జెండా రంగులు వేసుకోవడానికి చూపిన శ్రద్ధ, మౌలిక వసతులు కల్పించడంలో మాత్రం చూపలేదు. ఎన్నికల్లో లబ్ధిపొందాలన్న ఉద్దేశంతో గత ఏడాది చివరలో కొన్ని కాలనీల్లో లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లను పంపిణీ చేసింది. పూర్తిస్థాయిలో వసతులు కల్పించకపోవడంతో అరకొరగా లబ్ధిదారులు నివాసం వుంటున్నారు. మిగిలిన కాలనీల్లో ఒక్క మౌలిక సదుపాయం కూడా కల్పించలేదు. సొంతింటి కలను సాకారం చేసుకోవడానికి ఇంకెంతకాలం వేచిచూడాలోనని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. జిల్లాలో టిడ్కో ఇళ్ల స్థితిగతులపై 'ఆంధ్రజ్యోతి' గ్రౌండ్ రిపోర్ట్.**

పట్టణ ప్రాంతాల్లో పేదలకు పక్కా ఇళ్లను నిర్మించేందుకు గత తెలుగుదేశం ప్రభుత్వం టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిడ్కో)ను ఏర్పాటుచేసింది. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజనకు నోడల్ సంస్థగా 'టిడ్కో' కార్యకలాపాలు సాగిస్తుంది. టీడీపీ హయాంలో ఉమ్మడి విశాఖ జిల్లాగా వున్నప్పుడు (ప్రస్తుత అనకాపల్లి జిల్లా పరిధిలో) సుమారు ఏడు వేల మంది లబ్ధిదారులకు అనకా పల్లి మండలం సత్యనారాయణ పురం, కొండకొప్పాక, సిరసపల్లితోపాటు ఎలమంచిలి, నర్సీపట్నం మునిసిపాలిటీలు, పరవాడలో టిడ్కో గృహసముదాయాల నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. వైసీపీ అధికారంలోకి వచ్చే వరకు శరవేగంగా జరిగిన పనులు.... తరువాత ప్రభుత్వం మారడంతో ఒక్కసారిగా ఆగిపోయాయి. అప్పటికే పనులన్నీ పూర్తయి, నివాసానికి అనువుగా వున్న ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించకుండా వృథాగా వుంచేసింది. లబ్ధిదారులు ఆందోళనలు చేయడంతో ఎట్టకేలకు రెండేళ్ల తరువాత స్పందించి టిడ్కో ఇళ్ల నిర్మాణ పనుల పునఃప్రారంభానికి చర్యలు చేపట్టింది. అయినా సరే వైసీపీ ప్రభుత్వం దిగిపోయేనాటికి పూర్తిచేయలేదు. బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు.

అనకాపల్లి మండలం సత్యనారాయణపురం టిడ్కో గృహసముదాయంలోకి పూర్తిస్థాయిలో లబ్ధిదారులు రాకముందే నిర్మాణంలో నాణ్యతాలోపలు బయటపడుతున్నాయి. వర్షం కురిస్తే శ్లాబ్, గోడలు లీకేజీ అవుతున్నాయి. ప్లంబింగ్ పనులు నాసిరకంగా వుండడంతో పైపులు కారిపోతున్నాయి. తాగునీటి సదుపాయం, వీధి దీపాలు, డ్రైనేజీలు లేవు. చీకటిపడితే అంధకారం నెలకొంటున్నది. కాలనీలోని ఖాళీ ప్రదేశాల్లో తుప్పలు పెరిగిపోయాయి. ఇక్కడ మొత్తం 2,764 ఫ్లాట్లకుగాను సుమారు 500 కుటుంబాలు మాత్రమే నివాసం వుంటున్నాయి.

సొంత ఇంటి కల సాకారం కాలేదు



చాలా కాలం నుంచి అద్దె ఇంట్లో వుంటున్నాం. ఏడేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇంటిని మంజూరు చేసింది. ఏడాదిలో సొంత ఇంటి కల సాకారం అవుతుందని ఎంతో ఆశపడ్డాం. గృహ నిర్మాణ శాఖకు రూ.25 వేలు డీడీ కూడా తీసి ఇచ్చాము. ఫ్లాట్ కూడా కేటాయించారు. పనులు వేగంగా జరుగుతున్న సమయంలో ప్రభుత్వం మారింది. ఇళ్ల పనులు ఆపేశారు.

- మద్దాల మాధవి, టిడ్కో లబ్ధిదారురాలు, సిరసపల్లి, అనకాపల్లి



ఎలమంచిలిలో టిడ్కో కాలనీకి వెళ్లే మట్టి రోడ్డు



నర్సీపట్నంలోని బలిఘట్టంలో అంతర్గత రోడ్లు ఏర్పాటు చేయని టిడ్కో కాలనీ

కొండకొప్పాక, సిరసపల్లిలో 936 ఫ్లాట్లతో గృహ సముదాయాల నిర్మాణం గత టీడీపీ హయాంలో చేపట్టారు. 2019 ఎన్నికల నాటికి 90 శాతం పనులు పూర్తయ్యాయి. 800 మంది లబ్ధిదారులు వాటా సొమ్ము చెల్లించడంతో గృహనిర్మాణ శాఖ అధికారులు లాటరీ పద్ధతిలో డ్రా తీసి ఫ్లాట్లు కేటాయించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మిగిలిన పనులు పూర్తిచేయలేదు.

ఎలమంచిలి పట్టణంలోని రామ్‌నగర్ ప్రాంతంలో నిర్మించిన టిడ్కో గృహసముదాయంలో మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించకుండానే గత వైసీపీ ప్రభుత్వం హడావిడిగా లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ చేసింది. భవన నిర్మాణం, ప్లంబింగ్ పనులు నాసిరకంగా వుండడంతో లీకేజీలు అధికమయ్యాయి. మెయిన్ రోడ్డు నుంచి ... మిగతా 8వ పేజీలో



పరవాడ టిడ్కో కాలనీ వాసులు ఈ మట్టి రోడ్డులో నుంచే రాకపోకలు సాగించాలి

.... సమగ్ర వివరాలు 8వ పేజీలో

నర్సీపట్నం ఆస్పత్రిలో

గర్భిణి మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపణ

- ఇన్‌చార్జి సూపరింటెండెంట్, గైనికాలజిస్ట్‌తో వాగ్వాదం
- పోలీసులు సర్దిచెప్పడంతో శాంతించిన ఆందోళనకారులు



మృతిచెందిన గర్భిణి కంటె దేవి

నర్సీపట్నం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): **ప్రసవం కోసం స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో చేరిన గర్భిణి మంగళవారం తెల్లవారుజామున మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యమే కారణమని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్, గైనికాలజిస్టుతో వాగ్వాదానికి దిగారు. ఉదయం వరకు ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, ఆకస్మికంగా గుండె ఆగిపోయి మృతిచెందిందని ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారు. ఈ సంఘటనకు సంబంధించి మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా వున్నాయి.**



డాక్టర్‌ని నిలదీస్తున్న మృతిరాలి అత్త లక్ష్మి

ఎస్.రాయవరం మండలం చినగుమ్ములూరుకి చెందిన కంటె దేవి(30)కి నెలల నిండడంతో ప్రసవం కోసం కుటుంబ సభ్యులు సోమవారం మధ్యాహ్నం నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీశిలించి ఆమెను ప్రసూతి వార్డులో చేర్చారు. సోమవారం రాత్రి డాక్టర్ వచ్చి చూసి వెళ్లారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో నొప్పులు అధికం కావడంతో ఆమె అత్త లక్ష్మి, డ్యూటీ నర్సుని నిద్ర లేపారు. ప్రసవానికి ఇంకా సమయం పడుతుందంటూ నర్సు గుమ్మం దగ్గర నుంచే సమాధానం చెప్పి వెళ్లిపోయింది. తర్వాత ఉదయం వరకు ... మిగతా 8వ పేజీలో

భూముల విలువ సవరణ!

ప్రాంతాన్నిబట్టి 10 శాతం నుంచి 50 శాతం వరకు పెంపు

- కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు జనవరి ఒకటి నుంచి అమలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో భూముల విలువను ప్రభుత్వం స్వల్పంగా పెంచున్నది. జాతీయ రహదారికి సమీపంలో పొలాలు, స్థలాల విలువను బాగానే సవరించారు. ప్రాంతాన్నిబట్టి ప్రస్తుతం ఉన్న భూమి విలువ 10 శాతం నుంచి 50 శాతం వరకు పెరగనున్నది. దీంతో ఆస్తుల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగనున్నాయి. ఇప్పటికే అభ్యంతరాలను స్వీకరించిన రిజిస్ట్రేషన్ శాఖ... జనవరి ఒకటో తేదీ నుంచి పెంచిన విలువలను అమలు చేసేందుకు సిద్ధమవుతున్నది.

గత వైసీపీ ప్రభుత్వం 2023లో జాతీయ రహదారికి ఆనుకొని వున్న అనకాపల్లి, సబ్బవరం, కశింకోట, ఎలమంచిలి, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో భూముల విలువను భారీగా పెంచేసిన సంగతి తెలిసిందే. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు గణనీయంగా లాభపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత భూముల మార్కెట్ విలువను ప్రాంతాల వారీగా సవరణ చేస్తూ, అవసరం మేరకు భూముల విలువ పెంచడం ద్వారా స్వల్పంగా రిజిస్ట్రేషన్‌ల ధరలను పెంచాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని ప్రపోజల్స్ కమిటీలతో చర్చలు పూర్తి చేశారు. సూచనలు, అభ్యంతరాలను స్వీకరించి సమగ్ర నివేదికను కలెక్టర్, జేసీలకు అందజేశారు. వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి పెంచిన భూముల విలువలు, రిజిస్ట్రేషన్ చార్జీలు అమలులోకి రానున్నాయని జిల్లా రిజిస్ట్రార్ మన్మథరావు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు.



అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

ఏ ప్రాంతంలో.. ఎంత పెరగనున్నది..

అనకాపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో నివాసిత భూమి విలువ ప్రస్తుతం చదరపు ... మిగతా 8వ పేజీలో

జిల్లాలో ఇసుక అమ్మకాలు

ఆరు కేంద్రాలు ఏర్పాటు

- అనకాపల్లి, అచ్యుతాపురంలో టన్ను రూ.1,000
- చోడవరం, మాడుగులలో రూ.1,100, నర్సీపట్నంలో రూ.900, నక్కపల్లిలో రూ.800

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణదారుల సౌకర్యార్థం జిల్లాలో ఆరుచోట్ల ఇసుక నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లిని గోదావరి, కృష్ణ వాటర్ వేస్ అండ్ ట్రాన్స్‌పోర్టు కంపెనీకి కేటాయించామని, ఇక్కడ టన్ను వెయ్యి రూపాయలకు విక్రయిస్తారని, మైత్రి ఇన్‌ఫ్రాకు కేటాయించిన నర్సీపట్నంలో టన్ను రూ.900, చోడవరంలో రూ.1,100, మాడుగులలో రూ.1,100, బీవీఆర్ ఇన్‌ఫ్రాకు కేటాయించిన నక్కపల్లిలో రూ.800, నన్నపనేని ఎర్త్ మూవర్స్‌కు కేటాయించిన అచ్యుతాపురంలో టన్ను ఇసుక వెయ్యి రూపాయలకు విక్రయిస్తారని చెప్పారు. ఇసుక అవసరమైన వారు తమ వివరాలను 'శాండ్.ఏపీ.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని, రిజిస్ట్రేషన్ కాపీతో ఇసుక నిల్వ కేంద్రం వద్దకు వెళ్లాలని పేర్కొన్నారు. లేదంటే ఇసుక నిల్వ కేంద్రం వద్దకు ఆధార్ కార్డును తీసుకొని వెళ్లి అక్కడ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. స్టాక్ పాయింట్ ఇన్‌చార్జి డిజిటల్ పేమెంట్ చేయించుకొని ఇసుక సరఫరా చేస్తారని కలెక్టర్ తెలిపారు.

కొనసాగుతున్న ముసురు

అనకాపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం స్థిరంగా కొనసాగుతుండడంతో జిల్లాలో మంగళవారం కూడా ఆకాశం మేఘావృతమైంది. పలు మండలాల్లో కొద్దిపాటి జల్లులు పడ్డాయి. రానున్న రెండు రోజుల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం వుందన్న వాతావరణ కేంద్రం సమాచారంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను కొనసాగించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. అధికారులు మండల కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. సముద్ర తీర ప్రాంతంలో 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున సముద్రంలో చేపల వేటను రెండు రోజుల పాటు నిషేధించారు. కలెక్టరేట్‌తోపాటు అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీఓ కార్యాలయాల్లోని కంట్రోల్ రూమ్‌లలో 24 గంటలూ సిబ్బంది అందుబాటులో వుంటారు. కలెక్టరేట్‌లో 08924-226599, అనకాపల్లి ఆర్డీఓ కార్యాలయంలో 9491998293, నర్సీపట్నం ఆర్డీఓ కార్యాలయంలో 7075356563 ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచారు.

కార్మిక శాఖ అధికారుల హామీ అమలు చేయాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాము డిమాండ్

అభిజిత్ కార్మికుల ఆందోళన



తహసీల్దార్ జనార్దన్‌కు వినతిపత్రాన్నిస్తున్న కార్మికులు

అచ్యుతాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అభిజిత్ కార్మికులకు కార్మిక శాఖ అధికారులు ఇచ్చిన హామీని నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. మంగళవారం అభిజిత్ కార్మికులు పట్టణంలో ర్యాలీని నిర్వహించిన అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ అభిజిత్ కార్మికులతో కార్మిక శాఖ అధికారులు చర్చలు జరిపి జీతంతోపాటు ఒక నెల బోనస్ కూడా ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఇంతవరకు కనీసం జీతం కూడా ఇవ్వలేదన్నారు. వీరికి తక్షణం జీతాలు ఇవ్వకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ జీవీ జనార్దన్‌కు వినతి పత్రాన్నిచ్చారు. కార్యక్రమంలో కూండ్రపు సోమునాయుడు, అంగ కామేశ్వరి, రాజాన అమ్మాజీ, ఎస్.తలుపులమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ పార్కు అభివృద్ధి నిర్ణయం అభినందనీయం : కూటమి నేతలు



పాయకరావుపేటలో సమావేశమైన దళిత నాయకులు

పాయకరావుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎన్నో ఏళ్ళుగా అభివృద్ధికి నోచుకోని అంబేడ్కర్ పార్కును అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని ఉమ్మడి విశాఖ జిల్లాల టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పల్లా విలియంకేరి, జనసేన, బీజేపీ నాయకులు ఇంజరపు సూరిబాబు, కువల కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ పార్కులో కూటమి పార్టీల దళిత నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కూటమి నేతలు మాట్లాడుతూ అంబేడ్కర్ పార్కు అభివృద్ధితోపాటు కల్యాణ మండపం నిర్మాణానికి కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యుడు కశింకోట సత్తిబాబు, దళిత నాయకులు బోడపాటి శ్రీను, తాటిపాక లోవరాజు, ముంజులూరి దుర్గాప్రసాద్, గారా చంటి, ఐఎస్.మూర్తి, బద్ద సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వరి కుప్పలపై టార్పాలిన్లు కప్పాలి : ఏవో



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి కుప్పలు వేసుకుని వాటిపై టార్పాలిన్‌లు కప్పాలని మండల వ్యవసాయాధికారి పి.ఆదినారాయణ అన్నారు. మండలంలోని ఈదటం, పాల్మన్‌పేట గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ప్రకృతి వ్యవసాయం, ప్రభుత్వం అందించే పథకాలు వివరించారు. మామిడి తోటలకు ఎకరానికి రూ.2,200 ఇన్సూరెన్సు ప్రీమియం చెల్లించుకుంటే.. పంట నష్టపోతే రైతుకు నేరుగా ఇన్సూరెన్సు కంపెనీ క్లయిమ్ చేస్తుందన్నారు. అదేవిధంగా వరికి రూ.600, అపరాలకు రూ.300 ఇన్సూరెన్సు ప్రీమియం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ఎం.అశోక్ చక్రవర్తి, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాలికల బంగారు భవిష్యత్తుకు కిశోర వికాసం పునాది

- ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి



కిశోర వికాసం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి, ఇతర అధికారులు

రాంబిల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బాలికల బంగారు భవిష్యత్తుకు కిశోర వికాసం పునాది వేస్తుందని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్(ఐసీడీఎస్ పీడీ) అనంతలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని పంచదార్లలో జరిగిన కిశోర బాలికా వికాసం శిక్షణలో ఆమె మాట్లాడారు. ప్రతి బాలిక భవిష్యత్తును మెరుగుపరచడానికి ఇది ఒక మంచి కార్యక్రమమన్నారు. 11-18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబనను మెరుగుపరచడం కిశోర వికాసం లక్ష్యమన్నారు. డ్రాప్ అవుట్స్ తిరిగి చదువుకొనేలా ప్రోత్సహించడం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు పెంచడం, రక్తహీనతను నివారించడం, బాల్యవివాహాలను అడ్డుకోవడం, యోగా, శారీరక వ్యాయామాన్ని ప్రోత్సహించడం తదితర అంశాలను వివరించారు. అంతకుముందు పీడీ అనంతలక్ష్మి కిశోర వికాసం పోస్టర్లను ఆవిష్కరించి, అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీడీపీవో ఇందిరాదేవి, ఎంపీడీవో జయమాధవి, ఎంఈఓ సూర్యారావు, ఎస్ఐ నాగేంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మాలతీదేవి, ఎస్‌వీఎస్ రాణి, ఎస్‌కే మీరాబాయి, పైడికొండ, అన్నపూర్ణ, ఏఎన్ఎంలు, సచివాలయం సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబు



విద్యుత్ కాంతుల వెలుగులో ఎలమంచిలి ఆంధ్ర సెంటినరీ బాప్టిస్టు ఆలయం



విద్యుత్ దీపాలతో అలకరించిన కోటవురట్ల క్రీస్తు కృపాలయ బాప్టిస్టు చర్చి

ఎలమంచిలి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలకు పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పట్టణంలోని కాకివానివీధి ఆంధ్ర సెంటినరి బాప్టిస్టు ఆలయం 1907 సంవత్సరంలో ఏర్పాటు చేశారు. క్రిస్మస్ వేడుకలకు ఈ చర్చి పరిసర ప్రాంతమంతా విద్యుత్ కాంతులతో అలంకరించారు. చర్చి ఆవరణలో క్రైస్తవుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అదేవిదంగా పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి, రెహబోత్ ప్రాంతంలోని చర్చి, యర్రవరం, పెదపల్లి, సోమలింగపాలెం, రేగుపాలెం, పురుషోత్తపురం, ఏటికొప్పాకల్లోని చర్చిలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు చేశారు.

85 ఏళ్లనాటి క్రీస్తు కృపాలయ బాప్టిస్టు చర్చి

కోటవురట్ల: స్థానిక క్రీస్తు కృపాలయ బాప్టిస్టు చర్చిని 1939లో కెనడా దేశానికి చెందిన మిస్ హెలీయన్ స్థాపించారు. పురాతన చర్చి కావడంతో ఇక్కడ జరిగే క్రిస్మస్ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. చర్చి నిర్వహణకు అప్పట్లో ఓ కమిటీని ఏర్పాటుచేశారు. క్రిస్మస్‌కు వారం రోజులు ముందుగానే ఇక్కడ పండుగ హడావుడి ప్రారంభమవుతుంది. ఇప్పటికే పలువురు క్రైస్తవులు ఇళ్ల ముందు క్రిస్మస్ చెట్లు ఏర్పాటు చేసి, స్టార్స్ అమర్చారు. గృహాలకు విద్యుత్ దీపాలంకరణ చేశారు.

పక్కదారి పడుతున్న సబ్సిడీ గ్యాస్ సిలెండర్లు

- అచ్యుతాపురంలో కనిపించని కమర్షియల్ సిలెండర్లు
- వ్యాపారస్థులకు సిలెండర్ రూ.వెయ్యి
- కేజీ వంద రూపాయలకు రీఫిల్లింగ్
- పట్టించుకోని అధికారులు



హోటళ్లలో సాధారణ గ్యాస్‌తో వంటలు చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురంలో సబ్సిడీ గ్యాస్ సిలెండర్లు పక్కదారి పడుతున్నాయి. ఏ హోటల్‌లో చూసిన గృహ అవసరాల సిలెండర్లే కనిపిస్తున్నాయి తప్ప కమర్షియల్ సిలెండర్ కనిపించదు.

పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురంలో 25 వరకు పెద్ద హోటళ్లు, 39 వరకు చిన్న హోటళ్లు, 50 వరకు తోపుడుబళ్లు ఉన్నాయి. పెద్ద హోటళ్లతోపాటు తోపుడు బళ్ల వ్యాపారుల వరకు ఎవరూ కమర్షియల్ గ్యాస్ సిలెండర్లు వినియోగించడంలేదు. ఇక్కడ ఏ గ్యాస్ కంపెనీకి ఏజెన్సీ లేదు. పరవాడ, ఎలమంచిలి, అనకాపల్లి, రాంబిల్లి నుంచి ఇక్కడకు సిలెండర్లు సరఫరా చేస్తున్నారు. అందువల్ల గృహావసరాల సిలెండర్‌కి రూ.40లు రవాణా ఖర్చులు వేసుకొని ఇస్తున్నారు. ఎవరికైనా అవసరమైతే బుకింగ్ చేయకుండా సిలెండర్లు ఇవ్వడం లేదు. కాని బయట వ్యాపారస్తులకు ఎన్ని కావాలంటే అన్ని సబ్సిడీ సిలెండర్లు ఇస్తున్నారు. ఈ వ్యాపారం అచ్యుతాపురంలో భారీగా సాగుతోంది. గ్యాస్ డీలర్లు, వ్యాపారస్తులు కుమ్మక్కయి విచ్చలవిడిగా సబ్సిడీ సిలెండర్లు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గృహావసరాలకు వినియోగించే సిలెండర్లు వ్యాపారం నిమిత్తం వాడకూడదు. కాని వ్యాపారస్తులు బహిరంగంగానే వినియోగిస్తున్నారు.ఈ సిలెండరు వ్యాపారస్తులకు రూ.వెయ్యికి ఇస్తున్నారు. కొన్ని హోటళ్లలో వ్యాపారానికి వినియోగించే సిలెండర్ ఒకటి స్టవ్ వద్ద ఉంచుతున్నారు. అందులో గ్యాస్ ఉండదు. పక్కనుంచి గృహావసరాల సిలెండర్ నుంచి వినియోగిస్తున్నారు.



గ్యాస్ రీఫిల్లింగ్‌కు సిద్ధంగా ఉన్న సిలెండర్లు

దర్జాగా రీఫిల్లింగ్

అచ్యుతాపురంలో గ్యాస్ రీఫిల్లింగ్ దర్జాగా కొనసాగుతోంది. చాలా మంది వ్యాపారులు పెద్ద సిలెండర్ల నుంచి రీఫిల్లింగ్ చేస్తున్నారు. సెజ్ కారణంగా ఇక్కడ వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు, కూలీలు, బ్యాచిలర్లు అద్దెలకు గృహాలు తీసుకొని ఉంటున్నారు. వీరు చిన్న గ్యాస్ సిలెండర్ (4కేజీలు)లు వాడుతున్నారు. ఒకసారి సిలెండర్ కొన్న తర్వాత వాటిని వ్యాపారులు రీఫిల్లింగ్ చేస్తున్నారు. కేజీ వంద రూపాయలు తీసుకొని రీఫిల్ చేస్తున్నారు. ఇది చాలా ప్రమాదకరం. కానీ చాలా మంది వ్యాపారులు ఇదేవిధంగా గ్యాస్‌ని విక్రయిస్తున్నారు. బహిరంగంగా ఈ వ్యాపారం జరుగుతున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రైతాంగం అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

ఎలమంచిలి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా జిల్లాలో కురుస్తున్న వర్షాలకు రైతాంగం అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు విధిగా పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి బమ్మిడి మోహనరావు అన్నారు. మంగళవారం ఎలమంచిలిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే కోసిన పంట తడవకుండా తార్పాలిన్ వేసుకోవాలన్నారు. వారం రోజుల నుంచి వాతావరణ మారినందున వరి పనలపై ఉప్పు ద్రావణం వేసుకోవాలన్నారు. కుప్పలు పెట్టిన రైతులు టార్పాలిన్ కట్టి చర్యలు తీసుకోవాలన్నారు. చోడి విత్తనాలు మండల వ్యవసాయ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు అడిగిన ప్రశ్నలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి పి.మోహనరావు, ఏఈఓ దేముడు, సిబ్బంది అరుణ, లలిత, అభ్యుదయ రైతులు బాబూరావు, గణేష్, రాంబాబు, రమణ పాల్గొన్నారు.



రైతులకు సూచనలు అందిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బమ్మిడి మోహనరావు



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

విశాఖ డెయిరీ అభివృద్ధి కోసం బీజేపీలో చేరిక

- మునిసిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి

ఎలమంచిలి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తనతోపాటు విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్‌తోపాటు కొంతమంది డైరెక్టర్లు బుధవారం రాజమహేంద్రవరంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో ఆ పార్టీలో చేరనున్నట్టు మునిసిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి వెల్లడించారు. మంగళవారం ఇక్కడ నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, విశాఖ డెయిరీ అభివృద్ధే ధ్యేయంగా బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు. దీంతో సమావేశానికి హాజరైన వారంతా మీ వెంటే తాము వుంటామని తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆడారి శ్రీధర్, ఆడారి వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నా.. ఏమిటీ మతలబు?

- వాహన బేరర్ల కూలి రేట్లలో కోత
- ఆవేదన చెందుతున్న వెంకన్న సేవకులు

నక్కపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చినా అనుబంధ ఆలయాలపై టీటీడీ చిన్నచూపులో ఏ మాత్రం మార్పు కన్పించలేదు. ఇటీవల తిరుమలలో జరిగే పలు ఉత్సవాలు, తిరువీధి సేవల్లో వాహనాలను మోసే వాహన బేరర్లు ఒక్కొక్కరికీ రూ. 81,500 చొప్పున టీటీడీ బ్రహోత్సవ కానుక అందించింది. కానీ టీటీడీ అనుబంధ ఆలయాల్లో పనిచేసే వారికి మాత్రం ఈ మొత్తాలు అందలేదు. పైగా ప్రతీ ఏటా ఉత్సవాల సమయంలో వాహన బేరర్లకు ఇచ్చే కూలిలో ఈ ధనుర్మాసం నుంచి కోత విధించారు. కానుకలు ఇస్తారని ఆశపడ్డ ఉపమాక ఆలయ వాహన బేరర్లకు టీటీడీ అధికారులు ఊహించని షాక్ ఇచ్చారు.

ఉపమాక క్షేత్రంలో జరిగే అన్ని తిరువీధి సేవలు, ఊరేగింపులకు 80 కుటుంబాల వారు పూర్వం నుంచి స్వామివారి వాహనాలను మోస్తున్నారు. వందేళ్ల పైనుంచి పూర్వీకులు, వారి కుమారులు, ఇతర కుటుంబసభ్యులు ఈ సేవల్లో పాల్గొంటున్నారు. ఒక్కరోజు ఒక వాహనం మోసేందుకు వాహన బేరర్లకు పూర్వం ఒక రూపాయి ఇచ్చేవారు. క్రమేపీ వీళ్లకు ఇచ్చే కూలి పెరుగుతూ వచ్చింది. ఎండోమెంట్స్ పాలనలో కూడా ఒకరోజు వాహనం మోసే వారికి, రోజుకు ఒక్కొక్కరికీ రూ.200 ఇచ్చేవారు. కూలిపై ఆధారపడి జీవించే వీరంతా స్వామివారి తిరువీధి సేవలున్న రోజు పనులు మానుకుని భక్తితో వాహనాలను మోస్తున్నారు. ఇందుకోసం ఒక్కపూట కేటాయించాల్సి వస్తోంది. ఉపమాక క్షేత్రాన్ని టీటీడీ స్వాధీనపర్చుకుని 9 ఏళ్లు పూర్తయింది. 2024 అక్టోబరులో జరిగిన బ్రహ్మోత్సవాలకు కూడా ఒక్కో వాహన బేరర్‌కు రూ 250లు చొప్పున కూలి చెల్లించారు. సోమవారం నుంచి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రోజూ రెండు వాహనాలు మోయాలి. ధనుర్మాసం చివరి పది రోజులు రాత్రి వేళల్లో కూడా స్వామివారి వాహనాలను వీళ్లే మోయాల్సి వుంటుంది. ధనుర్మాస సేవల్లో తమకు ఇచ్చే కూలి పెరుగుతుందని ఆశపడ్డ వాహన బేరర్లకు ఊహించని షాక్ తగిలింది. ఒక్కొక్కరికీ ఇచ్చే రూ.250 కూలిని రూ.200లకు తగ్గిస్తూ టీటీడీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అంటే ఒక్కొక్కరికీ రూ.50 కోత విధించారు.ఇది చూసిన వాహన బేరర్లు కంగుతిన్నారు.



వాహనం మోస్తున్న బేరర్లు (ఫైల్)

కానుకల్లేవు కానీ.. కోతలా ?

పాసిలి వెంకటేశ్, వాహన బేరర్



మా నాన్న 60 ఏళ్ల పాటు దేవుడి వాహనాన్ని మోశారు. ఆయన తరువాత నేను 35 ఏళ్ల నుంచి స్వామివారి వాహనాన్ని భుజాన మోస్తున్నా. నేను కూడా రూ.10 కూలి నుంచి వాహన బేరర్‌గా పనిచేస్తున్నాను. రెండు నెలల కిందట రూ.250 ఇచ్చారు.. ఇప్పుడు రూ. 50 తగ్గించడం మంచిదికాదు. టీటీడీ అధికారులు న్యాయం చేయాలి.

పెంచాలి కానీ.. తగ్గిస్తారా ?

పోలవరపు గోవింద్, వాహన బేరర్



ఉపమాక ఆలయాన్ని టీటీడీ తీసుకున్న తరువాత మాకేమైనా మంచి చేయలేదు. ఏడాదికోసారి కూడా ఎటువంటి కానుకలు ఇవ్వడం లేదు. ఒక వాహనం మోయాలంటే దాదాపు ఐదారు గంటలు సమయం పడుతోంది. రాత్రి సేవలు వున్నప్పుడైతే ఒక్కో రోజు రాత్రి 12 గంటలలు కూడా అవుతుంది. చిన్నచూపు చూడడం సరికాదు. తగ్గించిన కూలిని వెంటనే పెంచాలి.

హంస వాహనంపై ఆనందరూపుడు



హంస వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ

నక్కపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం హంస వాహనంపై వెంకన్న తిరువీధి సేవ కన్నుల పండువగా జరిగింది. ఉభయదేవేరులతో స్వామివారిని హంస వాహనంపై పట్టుపీతాంబరాలు, పుష్పమాలలతో అలంకరించగా, పల్లకీలో గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తిని అలంకరించి మాడ వీధుల్లో మంగళవాద్యాల మధ్య ఊరేగించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు, అధికారులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

ఎంపీ దృష్టికి రాజీవ్‌నగర్ కాలనీ సమస్యలు



ఎంపీ రమేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు

నక్కపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజీవ్‌నగర్ కాలనీ సమస్యలను అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ దృష్టికి బీజేపీ మండల అధ్యక్షుడు కోసూరి శ్రీనివాసరావు తీసుకెళ్లారు. మంగళవారం అనకాపల్లి ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎంపీని కలిసి 12 ఏళ్లుగా కాలనీవాసులు అనుభవిస్తున్న కష్టాలను వివరించారు. అనంతరం ఎంపీకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సమస్యలపై ఎంపీ రమేశ్ సానుకూలంగా స్పందించినట్టు కోసూరి శ్రీను చెప్పారు. ఎంపీని కలిసిన వారిలో బీజేపీ నాయకులు పోలినాటి నానాజీ, శ్రీరంగ రమేశ్, వేముల వెంకట రమణ, కనకరాజు, జోగినాయుడు వున్నారు.

మత్స్యకారులకు వేట నిషేధ భృతి అందించాలి



డీటీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న మత్స్యకార నేతలు

రాంబిల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాడపాలెంలో మంగళవారం ఏపీ మత్స్య కార్మిక సంఘం అధ్వర్యంలో మత్స్యకారులు వేట నిషేధ భృతి అందించాలని ఆందోళన చేశారు. అనంతరం డీటీకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు చింతకాయల శివాజీ, చోడిపల్లి గంగరాజు మాట్లాడుతూ మత్స్యకారులకు ఇవ్వాలని వేట నిషేధ భృతిని ప్రభుత్వం అందించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే వేట నిషేధ సాయాన్ని అందించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు గరికిన అప్పారావు, సీహెచ్ పోతురాజు, ఎస్.ముసిలిరావు, చోడిపల్లి అప్పలరాజు, వెంకటేష్, సత్తిబాబు, జగ్గా, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- తహసీల్దారు జి.సత్యనారాయణ



పాయకరావుపేట రూరల్: కేశవరం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దారు సత్యనారాయణ

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్టు తహసీల్దారు జి. సత్యనారాయణ అన్నారు. మండలంలోని కేశవరంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులలో గ్రామ స్థాయిలో ఉన్న భూ వివాదాలు, భూ ఆక్రమణలు, 22ఏ, తదితర సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రైతుల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను పరిశీలించి, విచారించి త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా 11 దరఖాస్తులను స్వీకరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ రాజేంద్రప్రసాద్, సర్పంచ్ మేడిశెట్టి రామగోవిందు, వీఆర్‌ఓలు, రైతులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

మండలంలోని రేబాకలో మంగళవారం రెవెన్యూ సదస్సు లు నిర్వహించారు. తహసీల్దార్ నర్సింహమూర్తికి రైతులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. సదస్సులో సర్పంచ్ సాధిరెడ్డి శ్రీను, ఆర్ఐ కన్నబాబు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

మండలంలో జేవీపాలెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 31 వినతులు స్వీకరించినట్టు తహసీల్దార్ జె.రమేష్‌బాబు తెలిపారు. రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలన్నీ పరిష్కారం కానున్నాయని ఆయన తెలిపారు.



నక్కపల్లి: రైతుల నుంచి వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న తహసీల్దార్ నర్సింహమూర్తి

పర్యాటకంగా సరుగుడు జలపాతం అభివృద్ధి

▸ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

నాతవరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సరుగుడు జలపాతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. సుందరకోట-ఆసనగిరి రహదారి నిర్మాణానికి రూ.2 కోట్లతో బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సుందరకోట గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ 2014-2019 టీడీపీ ప్రభుత్వ హయాంలో సరుగుడు జలపాతానికి రూ.12 లక్షలు మంజూరు చేసి కొన్ని సౌకర్యాలు కల్పించామని చెప్పారు. విశాఖపట్నం, అనకాపల్లి, తుని తదితర దూరప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకుల సంఖ్య పెరుగుతుందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని సరుగుడు జలపాతం టూరిజంగా అభివృద్ధి చేస్తే ఇక్కడ గిరిజనులకు జీవనోపాధి కూడా లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటిసారిగా సరుగుడు నుంచి సుందరకోట కొండమీదకు టీడీపీ ప్రభుత్వం హయాంలోనే రూ.5 కోట్లతో రోడ్డు నిర్మించామని, మరలా ఇప్పుడు సుందరకోట-ఆసనగిరి కొండమీద గ్రామానికి రహదారి నిర్మిస్తున్నామని స్పీకర్ తెలిపారు. అలాగే సుందరకోట పంచాయతీలో కొండమీద ఉన్న ఎనిమిది గిరిజన గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ జయరాంను ఆదేశించారు. కొండమీదనున్న 256 గిరిజనులకు నెల రోజులలో పోడు భూములకు సంబంధించి పట్టాలను ఆర్డీవో వీవీ రమణ ఇస్తారని స్పీకర్ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే నాతవరం మండలానికి రూ.28 కోట్ల మంజూరు చేసి అభివృద్ధి పనులు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. అలాగే చమ్మచింత బాలుర వసతి గృహం, నాతవరం బాలుర, బాలికల వసతి గృహాల మరమ్మతుల కోసం రూ.38 లక్షల మంజూరు చేసినట్టు చెప్పారు. తాండవ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి నిధులు మంజూరు చేయడానికి కృషి చేస్తున్నానని, తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ ద్వారా తాండవ రిజర్వాయర్ పంటకాలువలను అభివృద్ధి చేస్తానని స్పీకర్ తెలిపారు. పెసా కమిటీ అధ్యక్షులు, గిరిజన నేత నూకరత్నం మాట్లాడుతూ కొండమీద గ్రామాలకు సిగ్నల్స్ అందకపోవడం వల్ల పింఛన్లు, రేషన్ తీసుకోవడానికి గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని, సెల్ టవర్లు ఏర్పాటు చేయాలని కోరారు. సుందరకోట, సరుగుడు పంచాయతీల్లో గ్రామాలోని గిరిజనులకు గిరిజనసెల్ కేజీహెచ్‌లో ద్వారా వైద్య సౌకర్యాలు, అంబులెన్స్ సదుపాయం ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఇక్కడ గిరిజన గ్రామాలలో చేతిబోర్లు కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నాగశిరీషా, తహసీల్దార్ వేణుగోపాల్, సుందరకోట సర్పంచ్ కొండతల్లి, సరుగుడు సర్పంచ్ గంగరాజు తాండవ ప్రాజెకు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గం ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర, ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, మాజీ ఎంపీపీలు ఎస్.విజయ్‌కుమార్, సింగంపల్లి సన్యాసిదేముడు, తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, కూటమి నాయకులు శెట్టి లోవ, కృష్ణారావు, వెలగల వెంకటరమణ, గవిరెడ్డి త్రినాథ్, గిరిజన ఏత పట్టెం రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.





నాతవరం మండలం సుందరకోట సభలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు... సుంకపూర్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

శాశ్వత పనులకు మొదటి ప్రాధాన్యం: స్పీకర్

మాకవరపాలెం: గ్రామాల్లో శాశ్వత అభివృదిజిఈ పనులకు కూటమి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తున్నదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. గిడుతూరు-సుంకపూర్ రోడ్డు పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం వరహానది వంతెనపై నుంచి వెళ్లే రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిడుతూరు నుంచి సుంకపూర్ గ్రామానికి 2.5 కిలోమీటర్ల పొడవునా తారు రోడ్డు వేస్తున్నట్టు చెప్పారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.1.85 లక్షలు మంజూరు చేశామన్నారు. ప్రతీ గ్రామంలోనూ శ్మశాన వాటికల నిర్మాణాలకు రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసినట్టు ఆయన చెప్పారు. వైసీపీ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వీవీ రమణ, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ప్రాజెక్టు డీఈ ఆర్‌వీ.సత్యనారాయణ, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, బీసీ సంఘం రాష్ట్ర డెరక్టర్ వీరసూర్యచంద్ర, కూటమి నాయకులు చినబాబు, బుచ్చిరాంప్రసాద్, ఆర్‌వై పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు

రావికమతం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు గ్రామాలలో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు ఎంపీడీవో కె.వెంకన్నబాబు తెలిపారు. ఈనెల 26న కొమిర, 27న కన్నంపేట, 28న చీమలపాడు గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాలలో వీటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయా గ్రామాలలో సున్నా నుంచి ఆరేళ్ల వయస్సు ఉన్న పిల్లలు, తల్లిదండ్రులు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'27న విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన'

నర్సీపట్నం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెరిగిన విద్యుత్ చార్జీలకు నిరసనగా ఈ నెల 27వ తేదీన నియోజవర్గం కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్ తెలిపారు. పెదబొడ్డేపల్లి పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం వైసీపీ పోరు బాట పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్నాను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, పార్టీ నాయకులు రుత్తల ఎర్రాపాత్రుడు, సీహెచ్.సన్యాసిపాత్రుడు, పట్టణ అధ్యక్షుడు ఏకా శివ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థి మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన



ఏరియా ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

నర్సీపట్నం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరు గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థి వంతల మనోజ్ మృతికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బాలుడు బంధువు ప్రాంతీయ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. 5 రోజుల క్రితం మనోజ్ తప్పిపోయినట్టు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. సోమవారం పాఠశాల వెనక చెరువులో మనోజ్ మృతదేహం లభ్యం కాగా, పోస్టుమార్టం కోసం స్థానిక ఆస్పత్రికి తీసుకువచ్చారు. దీంతో ఆస్పత్రి ఎదుట వారు బైఠాయించారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని, తండ్రికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గౌతమ్, డివిజన్ అధ్యక్షుడు భూషణ్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

మూడున్నర కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు



పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎస్ఐ తారకేశ్వరరావు, పోలీసులు

కృష్ణాదేవిపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు తరలిస్తున్న మూడున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశామని కృష్ణాదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించిన ఎస్ఐ తెలిపిన వివరాలిలా వున్నాయి. ముందస్తు సమాచారం మేరకు గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట-రత్నంపేట రహదారిలో ఎస్ఐ తమ సిబ్బందితో మంగళవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన చల్లా నాగశ్రీనివాస్ అలియాస్ మణికంఠ, మామిడి వీరశివసాయిదుర్గ బైక్‌పై వస్తుండగా అనుమానంతో వారిని ఆపి పోలీసులు తనిఖీ చేశారు. గోనె సంచులో మూడున్నర కిలోల గంజాయి ఉండడంతో స్వాధీనం చేసుకున్నారు. వారిద్దర్నీ అరెస్టు చేసి విశాఖపట్నం సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు తరలించారు.


చర్చిలకు క్రిస్మస్ శోభ



నర్సీపట్నంలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి



విద్యుత్ దీపాల అలంకరణలో గాంధీగ్రామంలోని ఆర్‌సీఎం చర్చి



కొత్తకోట చర్చిలో యేసు జననంపై ఏర్పాటు చేసిన సెట్టింగ్‌లు

చోడవరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ సందర్భంగా చర్చిలను అందంగా అలంకరించారు. క్రీస్తుజననం ముఖ్య ఘట్టాలను తెలిపే బొమ్మలు, క్రిస్మస్ ట్రీ, శాంతాక్లాజ్‌ల వేషధారణలో ముస్తాబు చేశారు. క్రీస్తు జన్మదినం సందర్భంగా బాలయేసు రాకను స్వాగతిస్తూ అర్ధరాత్రి చర్చిలలో ప్రార్థనలు చేశారు.

రావికమతం: మండలంలోని చర్చిలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు అయ్యాయి. ఈ సందర్భంగా చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. కొత్తకోట దివ్యబాల యేసు దేవాలయంలో యేసు జననంపై ఏర్పాటు చేసిన పలు సెట్టింగ్‌లు అందరిని ఆకట్టుకుంటున్నాయి. మంగళవారం రాత్రి నుంచే యేసు క్రీస్తు జయంతి, జాగరణ, దివ్యపూజలు నిర్వహించారు. బుధవారం తెల్లవారు నుంచే చర్చి ఫాదర్ అజయ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నర్సీపట్నం: నర్సీపట్నంలోని ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి, సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలలో క్రిస్మస్ పండగ ఏర్పాట్లు ఘనంగా చేశారు. ప్రార్థనా మందిరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళవారం రాత్రి క్రైస్తవ సోదరులు క్రీస్తు జన్మదిన గీతాలు ఆలపించారు. బంధువులకు, స్నేహితులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం క్రిస్మస్ పండగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రీస్తు ఆరాధన కీర్తనలు ఆలపిస్తారు. నిరుపేదలకు నిరుపేదలకు అన్నదానం, వస్త్రదానం చేస్తారు.

మాజీ మంత్రి రెడ్డి కుటుంబ సభ్యులకు అసెంబ్లీ సంతాప తీర్మానం



సంతాప తీర్మానాన్ని రెడ్డి కుటుంబ సభ్యులకు అందజేస్తున్న తహసీల్దార్ ప్రసాద్

చీడికాడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి రెడ్డి సత్యనారాయణకు అసెంబ్లీలో ఘనంగా నివాళులర్పించిన అనంతరం చేసిన సంతాప తీర్మాన కాపీని మంగళవారం పెదగోగాడలో రెడ్డి కుటుంబ సభ్యులకు తహసీల్దార్ వైవీఎస్. ప్రసాద్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెడ్డి సత్యనారాయణ ప్రజలకు అందించిన సేవలను స్మరిస్తూ గతనెల 16వ తేదీన శాసనసభ నివాళులర్పించిందన్నారు. ఈ సంతాప తీర్మాన కాపీని జిల్లా కలెక్టర్‌కు పంపించగా ఆమె ఆదేశాల మేరకు రెడ్డి కుమారుడు, కోడలు రెడ్డి రాము, జయలకు అందించారు. కార్యక్రమంలో జి.కొత్తపల్లి సర్పంచ్ కొల్లి సూరినాయుడు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి సన్యాసినాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పశుగ్రాసం పెంపకంపై రైతుల్లో చైతన్యం తీసుకురావాలి

చీడికాడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పశుగ్రాసం పెంపకంపై పాడి రైతుల్లో చైతన్యం తీసుకురావాలని పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకులు వి.చిట్టినాయుడు అన్నారు. మంగళవారం వరహాపురం రైతుసేవా కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న 21వ పశుగణన సర్వేపై ఆరా తీశారు. గ్రామంలో సర్వే చేసిన ఇళ్లను సందర్శించి, డేటాను పరిశీలించారు. కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ సహాయకురాలు మాధవి పాల్గొన్నారు.

చురుగ్గా గోకులం షెడ్ల నిర్మాణాలు



కె.నాయుడుపాలెంలో షెడ్ల నిర్మాణాన్ని పరిశీస్తున్న ఏపీఓ ఈశ్వరరావు

రోలుగుంట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 24 పంచాయతీలకు మంజూరైన 75 గోకులం షెడ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయని ఉపాధి హామీ పథకం ఏపీఓ ఈశ్వరరావు తెలిపారు. మంగళవారం కె.నాయుడుపాలెం, రోలుగుంట, రత్నంపేట, వడ్డిప గ్రామాల్లో షెడ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ షెడ్లకు రూ.1.79 కోట్లు మంజూరైట్లు తెలిపారు. ప్రస్తుతం 66 షెడ్ల నిర్మాణాలను రైతులు నిర్మాణ పనులు ప్రారంభించారని, అవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు.

నాగజ్యోతికి మోస్ట్ పాపులర్ వైశ్య విమెన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న నాగజ్యోతి

రోలుగుంట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్ టీచర్ నాగజ్యోతి మోస్ట్ పాపులర్ వైశ్య విమెన్-2024 అవార్డును మంగళవారం హైదరాబాద్‌లో అందుకున్నారు. వాసవి క్లబ్ రీజనల్ కార్యదర్శి అయిన నాగజ్యోతి వాసవి క్లబ్ ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. మానేపల్లి జ్యూవెలరీస్, ఇమ్మాది ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమెకు టాప్ 20 స్థానం కింద ఈ అవార్డును అందించారు.

ఆస్పత్రి భవనం నాణ్యతగా నిర్మించాలి

▸ అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

మాడుగుల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీహెచ్‌సీలో నూతనంగా నిర్మిస్తున్న అదనపు భవనాన్ని నాణ్యతగా ఉండాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఏపీఎంఎస్ఐ డీఈ నాగేశ్వరరావుని ఆదేశించారు. మంగళవారం ఆమె స్థానిక సీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.చంద్రశేఖరరావు, వైద్యులు, సిబ్బందికి ఆస్పత్రి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ ఓపీ, ప్రసవాలు, రోగులకు సదుపాయాలు వంటి అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ చంద్రశేఖర్ ఆస్పత్రిలో సమస్యలను వివరించారు. స్టాఫ్‌నర్సులు ఆరుగురు మాత్రమే ఉన్నారని, జనరేటర్ సక్రమంగా పనిచేయలేదని, అంబులెన్స్ లేక అవస్థలు పడుతున్నామని, గర్భిణులకు తప్పని పరిస్థితుల్లో సిజేరియన్ చేయడానికి థియేటర్ ఉన్నప్పటికీ అత్యవసర సమయాల్లో రక్తం అందించేందుకు బ్లడ్ స్టోరేజీ యూనిట్ లేదన్నారు. నిత్యం అధిక సంఖ్యలో ఏజెన్సీ ప్రాంతాల నుంచి ఇక్కడ ఆస్పత్రికి గిరిజన రోగులు వస్తుంటారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టర్ స్పందిస్తూ ఆస్పత్రికి కావలసిన సదుపాయాలన్నింటినీ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటానని, డెలివరీల సంఖ్య పెంచాలని సూపరింటెండెంట్‌ని ఆదేశించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని ఆమె పరిశీలించారు. పూర్తి స్థాయిలో పనులు ఎప్పుడు పూర్తవుతాయని ఏపీఎంఎస్ఐ డీఈ నాగేశ్వరరావును కలెక్టర్ ప్రశ్నించారు. మార్చి నెలాఖరు నాటికి పెండింగ్‌లో ఉన్న ఆస్పత్రి భవన నిర్మాణ పనులు జరుగుతాయని బదులివ్వగా, నిర్మాణ విషయంలో నాణ్యత లోపించకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు.



ఆస్పత్రి వైద్యులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

మాడుగుల హల్వా తయారీ పరిశీలన

అంతకుముందు మాడుగులలో పీఎంఎస్ఎంఈ ద్వారా రుణం తీసుకొని హల్వా తయారీని ఆమె పరిశీలించారు. హల్వా తయారీకి గోధుమల నుంచి పాలు తీయడం దగ్గర నుంచి పాకం పట్టడానికి ఎన్ని రోజులు సమయం పడుతుంది.. నెలకు ఎన్ని కిలోలు ఆన్‌లైన్ ద్వారా విక్రయాలు చేస్తున్నారని హల్వా తయారీ యజమాని ఉజ్వల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం హల్వాను రుచిచూశారు. ఇక్కడ తయారీ చేసిన హల్వా ఆన్‌లైన్ నెట్‌వర్క్ డిజిటల్ కామర్స్ ద్వారా ఢిల్లీలో విక్రయిస్తున్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ శచిదేవి, తహసీల్దార్ కె.రమాదేవి, ఎంపీడీవో కొంకి అప్పారావు, ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం, టీడీపీ నాయకులు పుప్పాల రమేష్, లెక్కల కాశిబాబు, ఢిల్లీ నానాజీ, పల్లెల రాము, మరువాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సామరస్యంగా భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

▸ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

కె.కోటపాడు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూ వివాదాలు, అన్నదమ్ముల భూ సమస్యలను అధికారుల వద్ద సామరస్యంగా పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. మంగళవారం మండలంలోని ఏ.భీమవరం గ్రామంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారానికి మండల స్థాయిలో అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ ప్రతి శనివారం భూవివాదాలను పరిష్కరిస్తుందన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అనేక తప్పిదాలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సరిదిద్దే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఈ సదస్సులతో భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చునన్నారు. అనంతరం గ్రామస్థులు నుంచి భూ సమస్యలపై జిల్లా కలెక్టర్ వినతిపత్రాలు తీసుకున్నారు. ఈ సదస్సులో ఆర్డీవో ఆయిషా, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమాదేవి, తహసీల్దార్ భాగ్యవతి, ఎంపీడీవో సాంబశివరావు, సర్పంచ్ తర్ర సన్యాసమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే బండారు

ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని చేరాలి : డీఈవో

చీడికాడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని చేరే వరకూ వెనక్కి చూడవద్దని జిల్లా విద్యాశాఖాధికారి దిడ్డి అప్పారావు నాయుడు అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని మంచాల మోడల్ స్కూల్‌ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టెన్త్, ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు సబ్జెక్టులపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి విద్యాభ్యాస సమయంలో పూర్తిస్థాయిలో విజయంపై దృష్టి సారించాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కష్టానికి తగ్గ ఫలితాన్ని తీసుకురావాలన్నారు. అనంతరం అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను సందర్శించి విద్యార్థులు తయారుచేసిన రోబోను పరిశీలించారు. దాని తయారీ విధానం, ప్రయోజనం అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పనితీరు, విద్యార్థుల ప్రగతిని చూసి సంతృప్తి వ్యక్తంచేశారు. ఆయన వెంట ఎంఈవోలు కె.బొంజుబాబు, బీవీ.రమణ, ప్రిన్సిపాల్ చెరకాపు వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

అధికారులందరూ హెడ్ క్వార్టర్‌లో ఉండాలి: తహసీల్దార్

రావికమతం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులందరూ హెచ్‌క్వార్టర్లలో ఉండాలని తహసీల్దార్ బి.వెంకటరమణ అన్నారు. కలెక్టరు ఆదేశాల మేరకు ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకూ అధికారులకు సెలవులు రద్దు చేశామన్నారు. వర్షాల తీవ్రత పెరిగితే నిత్యావసర వస్తువులు, తాగునీరు, వంటగ్యాస్ సరిపడంత సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

గవరల సంక్షేమానికి కృషిచేయండి : ఎంపీ రమేశ్



ఎంపీ సీఎం రమేశ్‌ని కలిసిన రాజు, గంగాధర్

చోడవరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో గవర సామాజికవర్గ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ భరోసా ఇచ్చారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన బొడ్డేడ గంగాధర్, స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మంగళవారం ఎంపీ సీఎం రమేశ్‌ని అనకాపల్లిలో కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్‌ను ఎంపీ అభినందించడంతోపాటు గవర సామాజిక వర్గానికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు చంద్రబాబు ప్రోత్సాహం అందిస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చెరకు రైతుల బకాయిలపై కూటమి నేతలు మౌనం వీడాలి

▸ ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి

చోడవరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గోవాడ చెరకు రైతుల బకాయిల చెల్లింపుపై కూటమి నేతలు కేఎస్ఎన్ఎస్ రాజు, పీవీఎస్ఎన్ రాజు స్పందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు మంగళవారం డిమాండ్ చేశారు. చెరకు రైతులు, కార్మికుల వేతన బకాయిలు చెల్లింపుపై కూటమి నేతలు హామీలకే పరిమితమయ్యారని, వారు చేస్తున్నదేమీ లేదని విమర్శించారు. చనిపోయిన రైతులకు పరిహారం చెల్లింపులతోపాటు, పదవీ విరమణ చేసిన కార్మికుల ప్రయోజనాలు కూడా ఇవ్వకపోవడాన్ని ఆయన తప్పుపట్టారు. క్రషింగ్ సీజన్ ప్రారంభమయ్యేలోగా రైతుల బకాయిలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.


అరకులో జరిగిన గ్రామ సభలో మాట్లాడుతున్న పీవో అభిషేక్


మినుములూరులో మాట్లాడుతున్న డీపీవో లవరాజు


పెసా చట్టంపై అవగాహన కల్పిస్తున్న జీకేవీధి ఎంపీపీ బోయిన కుమారి

పెసా కమిటీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

▸▸ ఐటీడీఏ పీవో అభిషేక్

డుంబ్రిగుడ, డిసెంబరు 24, (ఆంధ్రజ్యోతి): పెసా కమిటీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని ఐటీడీఏ పీవో అభిషేక్ అన్నారు. మండలంలోని అరకు పంచాయతీ కార్యాలయ ఆవరణలో పెసా దినోత్సవ ప్రత్యేక గ్రామసభ ఎంపీడీవో ప్రేమ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఇందులో పాల్గొన్న పీవో మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి పెసా కమిటీల ఎన్నికలు దోహదపడతాయన్నారు. ఉపాధ్యక్షుడు, కార్యదర్శి పదవులకు ఎన్నికలను చేపట్టాలన్నారు. సకాలంలో ఓటరు జాబితను పొందుపరచాలన్నారు. ఓటర్ల జాబితాల్లో తప్పులు లేకుండా ప్రదర్శించాలన్నారు. ఎన్నికల్లో గిరిజనులు ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రజిని, జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, సర్పంచి శారద, పంచాయతీ కార్యదర్శి షేక్‌వల్లి, సచివాలయ సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.

విజయవంతంగా పెసా దినోత్సవం

పాడేరురూరల్: జాతీయ పెసా చట్టం (పంచాయతీరాజ్ షెడ్యూల్డ్ ప్రాంతాల విస్తరణ చట్టం.1996) ఆమోద దినోత్సవం సందర్భంగా మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన మంగళవారం ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు. పాడేరు మేజర్ పంచాయతీలో నిర్వహించిన సభకు కలెక్టర్ దినేశ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండలంలోని మినుములూరులో సర్పంచ్ లంకెల చిట్టమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో డీపీవో బి.లవరాజు పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో నివసించే ప్రజల కోసం గ్రామ సభల ద్వారా స్వయం పాలనను నిర్ధారించడానికి వీలుగా రాజ్యాంగంలోని విభాగం-9 లోని నిబంధనలు కొన్ని మినహాయింపులు, సవరణలతో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పంచాయతీ విస్తరణ (పెసా చట్టం)1996 డిసెంబరు 24వ తేదీన అమలులోకి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో పెసా దినోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా పంచాయతీల్లో ప్రత్యేక గ్రామ సభలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మండలంలోని గుత్తులపుట్టులో సర్పంచ్ బాబూరావు పడాల్ అధ్యక్షతన జరిగిన సభలో పాల్గొన్న తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకట సురేష్‌కుమార్, కిండంగి పంచాయతీలో సర్పంచ్ కూడా శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో జీసీసీ డైరెక్టర్, బొర్రా నాగరాజు, మోదాపల్లి సభలో పాలికి లక్కు పాల్గొని పెసా చట్టం ప్రాముఖ్యతను వివరించారు.

సీలేరులో..

సీలేరు: సీలేరులో పెసా చట్టం ఆవిర్భావ దోనోత్సవం స్థానిక సర్పంచ్ అధ్యక్షతన రైతు భరోసా కేంద్రంలో నిర్వహించారు. జీకేవీధి ఎంపీపీ బోయిన కుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో గిరిజనుల హక్కులను కాపాడుకోవడానికి పీసా చట్టం ఏవిధంగా దోహదపడుతుందని గిరిజనులకు ఆమె అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పిల్లా సాంబమూర్తి, ఉప సర్పంచ్ కె. వల్లీప్రసాద్, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ డి. సూర్యప్రకాశరావు, కూటమి నాయకులు బొర్రా కృష్ణ, చిటికెల రాము, కె. సన్యాసిరావు, వనముల రాము, బాలకృష్ణ, ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు మనోజ్, కాంగ్రెస్ నాయకులు కారే శ్రీనివాస్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి: పెసా చట్టాన్ని పంచాయతీ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి అన్నారు. మంగళవారం మండలంలోని 17 పంచాయతీల్లో ఈ గ్రామ సభలు జరిగాయి. తాజంగి పంచాయతీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ పెసా గ్రామ సభ ప్రత్యేక అధికారాల ద్వారా గిరిజనుల హక్కులు, చట్టాలను పరిరక్షించుకోవచ్చునన్నారు. ఈ చట్టంపై ప్రజలు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. చింతపల్లి గ్రామ సభలో ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు, పెదబరడలో ఏటీడబ్ల్యూవో జయ నాగలక్ష్మి హాజరయ్యారు. ఈ గ్రామ సభల్లో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దురియా పుష్పలత, పలు మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

హుకుంపేట మండలంలో..

హుకుంపేట; ప్రభుత్వం పెసా చట్టం పటిష్ఠ అమలుతోనే గిరిజనులకు రక్షణ ఉంటుందని వైస్ ఎంపీపీ ఎస్. కొండలరావు తెలిపారు. మంగళవారం మండలంలోని 33 పంచాయతీల్లో స్థానిక సర్పంచ్‌లు అధ్వర్యంలోని పెసా చట్టం దినోత్సవ ఘనంగా నిర్వహించారు. అండిభ పంచాయతీలో వైస్ ఎంపీపీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గిరిజన భూములను బినామీ ద్వారా గిరిజనేతలు ఆక్రమిస్తున్నారన్నారు.

ముంచంగిపుట్టు

ముంచంగిపుట్టు: ఆదివాసీల ఆయుధం పెసా చట్టమని, దీనిపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని దారెల పంచాయతీ సర్పంచ్ పి. పాండురంగస్వామి అన్నారు. మండలంలోని 23 పంచాయతీ పరిధిలో పెసా డే గ్రామ సభలను నిర్వహించారు. ఆ చట్టం ప్రాముఖ్యతను గిరిజనులకు వివరించారు. తెలియజేశారు. ఆయా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ


సీలేరు జూనియర్ కాలేజీ ఆవరణలో మొక్కలునాటుతున్న విద్యార్థులు

సీలేరు, డిసెంబరు 24 , (ఆంధ్రజ్యోతి): సీలేరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో మంగళవారం విద్యార్థులు మొక్కలను నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కాలేజీ ఆవరణ పరిసరాల్లో వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంకరరావు, ఎన్ఎస్ఎస్ పీవో డి. శ్రీను, అధ్యాపకులు పాల్గొన్నారు.

'ఏసుక్రీస్తు ప్రేమను ఆచరణలో చూపాలి'


రోగులకు రొట్టెలు, పండ్లు అందిస్తున్న వైద్యాధికారి, నర్సింగ్ సూపరింటెండెంట్

చింతపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు ప్రేమను ఆచరణలో చూపాలని స్థానిక ఏరియా ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి సూచించారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని మంగళవారం ఆస్పత్రిలో రోగులతో కలిసి ఆయన, వైద్యాధికారులు కేక్‌ని కట్ చేశారు. అనంతరం నర్సింగ్ సూపరింటెండెంట్ సొంత నిధులతో సమకూర్చిన పండ్లు, రొట్టెలను రోగులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పేదలకు సహాయపడడమే నిజమైన క్రిస్మస్ అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు చంద్రశేఖరరావు, రుక్మిణి, అజయ్ పాల్గొన్నారు.

ఒడిశా మద్యం సీసాలు స్వాధీనం


మద్యం బాటిల్స్, నిందితుడితో ఎస్ఐ

ముంచంగిపుట్టు, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి) : ఒడిశా నుంచి ఆంధ్రాకు తీసుకువస్తున్న మద్యం బాటిల్స్‌ను మంగళవారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. స్థానిక ఎస్ఐ జె.రామకృష్ణ అందించిన వివరాల ప్రకా రం... మండలంలోని లబ్బూ రు సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు చేపడుతుండగా, ఒడిశా వైపు నుంచి ఆంధ్రా వైపుగా వస్తున్న మారుతీ 800 వాహనాన్ని ఆపి పోలీసులు తనిఖీ చేశారు. అందులో 24 మ్యాన్షహౌస్, 2 ఎంసీ బాటిల్స్, 48 కింగ్‌ఫిషర్ టిన్స్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. పట్టుబడిన మద్యం సుమారు రూ.14 వేలు విలువ ఉంటుందని ఎస్ఐ తెలిపారు. నిందితుడు ఒడిశాలోని మాచ్‌ఖండ్ గ్రామానికి చెందిన డుమ్మ్యాధర్ హంటల్‌గా గుర్తించారు.

రోడ్ల నిర్మాణానికి వీలుగా సర్వే పూర్తి


రాచకీంలో చేస్తున్న సర్వేలో సర్పంచ్ గణేశ్, సచివాలయ అధికారులు

అనంతగిరి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పినకోట పంచాయతీ సమీధ నుంచి చింతపాక, గుమ్మంతి నుంచి రాచకీలం మీదుగా రెడ్డిపాడుకు రెండు మార్గాల్లో రహదారుల నిర్మాణానికి నాలుగురోజుల కిందట బల్లగరువు వద్ద ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే.అయితే, ఆయా రోడ్ల పనులకు సంబంధించి, పినకోట సర్పంచ్ శిరగం గణేశ్, సచివాలయఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎం.అప్పలరాజుతో కలిసి రెండు రోజులుగాఆ గ్రామాలకు వెళ్లి సర్వే చేసి పూర్తి చేశారు. దీంతో ఇక, పనులు ప్రారంభం కావాల్సి ఉంది..

వలసగెడ్డకాలనీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సీలేరు : జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని వలసగెడ్డకాలనీలో సీసీ రోడ్డు పనులను మంగళవారం ఎంపీపీ బోయిన కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ. 5 లక్షల అంచనాలతో ఉపాధి నిధులతో 100 మీటర్ల సీసీ రో డ్డు మంజూరైనట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కేలేబు కుమారి, ఉపసర్పంచ్ మంగరాజు, కూటమి నాయకుడు బాలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మనోజ్‌తేజ మృతికి అధికారులదే బాధ్యత

▸▸ దండకారణ్య విద్యార్థి సమితి ప్రతినిధులు డిమాండ్


విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్న నాయకులు

గూడెంకొత్తవీధి, డిసెంబరు 24 , (ఆంధ్రజ్యోతి) : కొయ్యూరు ఏపీ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వంతల మనోజ్‌తేజ మృతి చాలా బాధాకరమని జీకేవీధి మండలం దండకారణ్య విద్యార్థి సమితి ప్రతినిధులు విచారం వ్యక్తంచేశారు. మంగళవారం మనోజ్‌తేజ చిత్ర పటానికి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, గత నెలరోజులుగా గురుకుల పాఠశాల సిబ్బంది సమస్యలపై ధర్నా చేస్తున్నారని, ఈ స్థితిలో పిల్లలను కనీసం పట్టించుకునే వారు కరువయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ స్థితిలో ఇంకా ఎంతమంది ఆదివాసీ అమాయకులు ప్రాణాలర్పించాలని ప్రభుత్వం కోరుకుటుందని వారు ప్రశ్నించారు. కొన్ని రోజులుగా ఏజెన్సీ 11 మండలాల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు చనిపోతున్నారని, వీటికి అధికారులు బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకుని పాఠశాలల సిబ్బందిని విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనుమానాస్పద స్థితిలో చనిపోయిన మనోజ్ కుటుంబానికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని, రూ. కోటి పరిహారం అందించాలన్నారు. ఇకపై ఏజెన్సీలో ఎటువంటి మరణాలు సంభవించకుండాఅధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులకు స క్రమంగా బోధననందించే వరకు దండకారణ్య ఉద్యోగ సమితి న్యాయపోరాటం చేస్తోందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దండకారణ్య ఉద్యోగ సమితి నాయకులు కవడం కాసులమ్మ, వెంకయమ్మ, విద్యార్థి సంఘం నాయకులు ప్రసాద్, అజయ్, లోకేష్, అశోక్, చిన్న, బాలకృష్ణ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినియోగదారుల దినోత్సవం



మానవహారం చేస్తున్న కళాశాల అధ్యాపకులు, సిబ్బంది

పాడేరురూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్‌ప్రిన్సిపాల్ టీఎన్ రసూల్ మాట్లాడుతూ జాతీయ వినియోగదారుల హక్కుల చట్టం 24 డిసెంబరు 1986లో ఆమోదించారన్నారు. ఈ చట్ట ప్రకారం వినియోగదారునికి ఆరు హక్కులు ఉన్నాయన్నారు. భద్రత , సమాచార హక్కు, ఎంపిక హక్కు, నాణ్యత తెలిపే హక్కు, ఫిర్యాదు, పరిష్కార హక్కులను వివరించారు. దుకాణదారుల ఆర్థిక సాధికారిత, నగదు రహిత, పీడీఎస్ వన్ నేషన్ వన్, రేషన్ కార్డు అమలు సరఫరా తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పట్టనంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు, అధ్యాపకులు వి.శంకరరావు, జీవనజ్యోతి, హిమబిందు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధన దిశగా చదవాలి: పీవో


కంతబొంసుగుడ పాఠశాలలో విద్యార్థితో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

అరకులోయ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధనకు కష్టపడి చదవాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సూచించారు. మంగళవారం అరకులోయలోని కంతబొంసుగుడ బాలుర ఉన్నత పాఠశాలను డీడీ రజని, ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. వారి భవిష్యత్తు ఆలోచనలపై ఆరా తీశారు. అనంతరం సమావేశమై కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ప్రభుత్వం విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ పలు సదుపాయాలు కల్పిస్తోందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని రాణించాలన్నారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకశ్రద్ధ వహించి విద్యార్థులకు కెరీర్‌గైడెన్స్‌పై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పీవో వెంట పాఠశాల హెచ్ఎం ఎల్‌బీ దయానిధి, డిప్యూటీ వార్డెన్ అప్పలరాజు ఉన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

▸▸ కలెక్టర్ విజయకృష్ణన్


విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

దేవరాపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థినులకు కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. మండలంలోని బేతపూడి కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తితో కలిసి మంగళవారం ఆమె సందర్శించారు. పదవ తరగతి విద్యార్థినుల పఠనా సామర్థ్యాన్ని పరీక్షించారు. పాఠశాలలో మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ నియోజకవర్గంలోని కేజీబీవీలలో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆయేషా, డీఎల్‌డీవో మంజులావాణి, జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు, ఎంపీపీ చింతలబుల్లి, జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయ చైర్మన్ పోతల పాత్రునాయుడు, కేజీబీవీ ప్రత్యేక అధికారి సీహెచ్ భువన మాధురి, వైస్ ఎంపీపీ భవాని, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వాలాబు పంచాయతీ సందర్శన

మండలంలోని గిరిజన పంచాయతీ వాలాబు శివారు గ్రామాలను కలెక్టర్ సందర్శించారు. గిరిజన సంప్రదాయంలో గిరిజనులు కలెక్టర్ కాలు కడిగి బొట్టు పెట్టి ఆహ్వానించారు. గిరిజనుల సమస్యలను ఆమె అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, మిగతా గ్రామాలకు లింకు రోడ్లు కావాలని గిరిజనులు కోరారు. పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. డుమా పీడీ ఆర్.పూర్ణిమాదేవి, తహసీల్దార్ లక్ష్మీదేవి, డీఈఈ సత్యంనాయుడు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

క్రిస్మస్‌కు ముస్తాబయినచర్చిలు

సీలేరు, డిసెంబరు 24 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరులో క్రిస్మస్ సందర్భంగా వివిధ చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. స్థానిక యూసీఐఎం, పెంతుకోస్తు, కల్వరి, గేస్తుమన్నే, షాలేము ప్రార్థనా మందిరం చర్చిల్లో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పోటీ పోటీగా అలంకరించారు. సీలేరులో జలవిద్యుత్ కేంద్రం నిర్మాణం తరువాత 1970లో మొదటిగా యూసీఐఎం చర్చిని అప్పటి ఏపీఎస్ఈబీ ఇంజినీర్లు, ఉద్యోగులు కలసి నిర్మించారు. కొన్ని సంవత్సరాల తరువాత ఈ చర్చి విశాఖలో ప్రముఖ క్రైస్తం ప్రసంగికుడు అయిన కేఆర్ సింగ్ ఆధ్వర్యంలో నడుస్తోంది. ఈ చర్చికి ఏటా జర్మనీ దేశస్థులు సందర్శించి ప్రార్థనలు చేసి వెళ్తుంటారు. అలాగే, క్రిస్మస్ సందర్భంగా మంగళవారం రాత్రి నుంచే సీలేరులో అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

28 నుంచి 31 వరకు ఏపీజీవీబీ బ్యాంకు సేవలు నిలిపివేత

▸▸ రీజనల్ మేనేజర్ సతీశ్‌చంద్ర

పాడేరురూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) ఆదేశాల మేరకు వరంగల్ ప్రధాన కార్యాలయం కేంద్రంగా ఏపీజీవీబీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో తమ కార్యకలాపాలను విభజించనున్నందున ఈ నెల 28వ తేదీ నుంచి 31వ తేదీ బ్యాంకు సేవలు నిలిపివేయనున్నట్టు బ్యాంకు రీజనల్ మేనేజర్ ఎస్.సతీశ్ చంద్రమంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నాలుగురోజుల వరకు బ్యాంక్ సేవలు, ఏటీఎం కార్డులు, ఆన్‌లైన్ నగదు లావాదేవీలతో పాటు ఇతర బ్యాంకు కార్యకలాపాలు పూర్తిగా నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు. జనవరి 1వ తేదీ నుంచి బ్యాంక్ సేవలు తిరిగి అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ అసౌకర్యాన్ని ఖాతాదారులు గమనించాలని ఆయన సూచించారు.

రెవెన్యూ సదస్సులకు విశేషస్పందన

▸▸ కించూరు సదస్సులో భూ సమస్యలపై 143 ఫిర్యాదుల స్వీకరణ



కించూరు రెవెన్యూ సదస్సులో వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ త్రినాధరావు

పాడేరురూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని తహసీల్దార్ వంజంగి త్రినాధరావు నాయుడు అన్నారు. తుఫాన్ నేపథ్యంలో మంగళవారం వర్షం కురిసినా మారుమూల కించూరు పంచాయతీ కేంద్రంలో నిర్వహించిన సదస్సుకు వివిధ గ్రామాల ప్రజలు హాజరై భూ సమస్యలు, భూ సరిహద్దుల సమస్యలు, మ్యుటేషన్ తదితర సమస్యలపై 143 ఫిర్యాదులను అందించినట్టు తెలిపారు. ఈ ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి సమస్యలను సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంతాల రాంబాబు, గ్రామ పెద్దలు, డిప్యూటీ తహసీల్దార్ పి. పోలురాజు, ఎలక్షన్ డీటీ కె.లక్ష్మణమూర్తి, ఆర్ఐ బి.నల్లన్న, మండల సర్వేయర్ వి.భీమయ్య, వీఆర్‌వో కె.ప్రేమ్‌చంద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీజీహెచ్ భవన నాణ్యతా లోపంపై ఫిర్యాదు


పాడేరు జిల్లా ఆస్పత్రి భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

పాడేరురూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పాడేరులోని జీజీహెచ్ భవనం 2వ అంతస్తు నిర్మాణంలో నాణ్యత లోపించడంతో సంబంధిత నిర్మాణ సంస్థ ఎన్‌సీసీపై రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయనున్నట్టు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు తెలిపారు. మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి జీజీహెచ్ భవన -2వ నిర్మాణపనులను పరిశీలించారు. గతంలో భవనాన్ని పరిశీలించి లీకేజీలు, తలుపులు ఊడిపోవడం, గచ్చులు బీటలు వారి, రోగుల వార్డులు, టాయిలెట్స్ సక్రమంగా లేక పోవడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. అనంతరం తూతూ మంత్రంగా పనులు చేపట్టి కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఈ విషయంపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్రరావు, వేమనబాబు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గిరిజన గురుకుల ఉద్యోగుల దీక్షలు


వర్షంలో తడుస్తూ నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు

పాడేరురూరల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకులాల్లోని విద్యాలయ ఉపాధ్యాయులు, అధ్యాపకులు మంగళవారం వర్షంలోనూ నిరసన కొనసాగించారు. గురుకుల విద్యాలయాల్లో 17 ఏళ్లగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న తమను సీఆర్టీలుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో జిల్లా కేంద్రం పాడేరు ఐటీడీఏ ఎదుట రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. మంగళవారం వర్షం వల్ల దీక్ష శిబిరంలో కూర్చొనేందుకు అవకాశం లేకుండా హోరు గాలి, జోరు వాన కురిసి ఇబ్బందులకు గురిచేసింది. అయినా, పట్టువదలకుండా ఉద్యోగులు శిబిరంలో నిల్చొని సాయంత్ర వరకు దీక్షలు చేపట్టారు. అధికారులు తమ సమస్యలు పరిష్కరించేంత వరకు దీక్షలను విరమించేదే లేదని వారు స్పష్టం చేశారు.

'అంబేడ్కర్‌పై అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు సరికాదు'


కలెక్టర్ దినేష్ కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజారావు

పాడేరురూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు, డీసీసీ అధ్యక్షుడు శతక బుల్లిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ ఏఎస్.దినేశ్ కుమార్‌ను వేర్వేరుగా వారు కలిసి వినతిపత్రాలందించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి అక్కడ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌పీ నాయకులు ఎస్.అప్పారావు, ఎం.మాధవరావు, ఎస్.చిన్నయ్యదొర, ఎం.పండన్న పాల్గొన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శతక బుల్లిబాబు, నాయకులు వంతాల కృష్ణారావు పాల్గొన్నారు.

ఫసల్ బీమాతో పంట పరిహారం


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి

చింతపల్లి, డిసెంబరు 24, (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని బొర్రె , కుడుపుసింగి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 31 లోగా రాజ్‌మా, వరి రైతులు బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. దీనివల్ల ప్రకృతి వైపరీత్యాలు, ఇతరత్రా నష్టంజరిగి పంట దిగుబడులు తగ్గితే పరిహారాన్ని పొందవచ్చంటూ ఆయన అవగాహన కల్పించారు.

రేపటి నుంచి వలంటీర్ల రిలే దీక్షలు

పెదబయలు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామ వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ మండల కేంద్రంలో ఈ నెల 26,27,28, తేదీల్లో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని వాలంటీర్ల అనుబంధ సంఘం సీఐటీయూ పిలుపునిచ్చింది. మంగళవారం స్థానిక విలేకరుల సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సన్నిబాబు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లను తిరిగి విధుల్లో తీసుకుని, వారికి రావాల్సిన 7 నెలల బకాయి వేతనాలను చెల్లించాలన్నారు. లేకుంటే ఆందోళనను విస్తృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వలంటీర్ల సంఘం నేతలు తాతబాబు, లోహిదాసు, ప్రవీణ్‌కుమార్,కృష్ణారావు, గిరిజన సంఘం నేత ధర్మన్నపడాల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై మురికి నీరు.. పట్టించుకునేవారే లేరు!

సెమీ అర్బన్ ప్రాంతంగా గుర్తింపు పొందుతున్న సబ్బవరంలో రెండు జాతీయ స్థాయి వర్సిటీలు.. నిర్మాణంలో మరో జాతీయ వర్సిటీ ఉన్నాయి. అందుకే జాతీయ స్థాయి అధికారులు, న్యాయవాదులు, జడ్జిలు, నాయకులు తరచూ సందర్శిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న సబ్బవరంలో చెత్త వాతావరణం దర్శనమిస్తోంది. ప్రధాన రహదారులపైనే మురుగు ఏరులై పారుతోంది. ఫలితంగా భరించలేని దుర్గంధంతో సందర్శకులు ఈసడించుకునే దుస్థితి దాపురించింది.

సబ్బవరం ఆర్అండ్‌బీ రహదారులపై ఏరులై పారుతున్న మురుగు

- భరించలేని దుర్గంధంతో స్థానికుల అగచాట్లు
- ముక్కు మూసుకుంటున్న చిరు వ్యాపారులు
- అధికారులు, ప్రజాప్రతినిధుల్లో స్పందన కరువు



సబ్బవరం నుంచి పెందుర్తి వెళ్లే రహదారిపై ఏరులై పారుతున్న మురుగు నీరు

సబ్బవరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎన్టీఆర్ జంక్షన్ నుంచి చోడవరం రోడ్డులో గొటివాడ, అనకాపల్లి రోడ్డులోని ఇరువాడ పెట్రోలు బంద, పెందుర్తి రోడ్డులో పాతరోడ్డు వరకు ప్రధాన రహదారికిరువైపులా ఆర్అండ్‌బీ స్థలాలు దురాక్రమణకు గురయ్యాయి. ఈ స్థలాల్లో కొంత మంది దర్జాగా దుకాణాలు నిర్మించి అద్దెలకు వచ్చేశారు. ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు వారికి అడ్డే అడ్డుచెప్పలేదు. పంచాయతీ అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేసినా, రాజకీయ ఒత్తిళ్లతో విరమించుకుంటున్నారు. ఇక ఆర్అండ్‌బీ అధికారులు ఉన్నారో, లేరో కూడా తెలియని పరిస్థితి. ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారుల మధ్య మన్వయం లోపించడంతో అక్రమార్కులకు బాగా కలసి వచ్చిందని చెబుతారు. ఫలితంగా మూడు వైపులా రోడ్డు ఆక్రమణకు గురవడంతో ఇళ్లు, దాకానాలు, రెస్టారెంట్లు, ఇతర వ్యాపార సంస్థల నుంచి వచ్చే వాడుక నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో మండల కేంద్రానికి వివిధ అవసరాల నిమిత్తం వచ్చే ప్రజలు ముక్కులు మూసుకుంటూ పనులు సాగిస్తున్నారు. రహదారికి ఇరువైపులా చిరు వ్యాపారాలు నిర్వహిచుకునే వారు దుర్గంధంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వరదల సమయంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. సాయినగర్ నుంచి వరద నీరు రోడ్డుపై ప్రవహించి పోలీసు స్టేషన్‌ను ముంచెత్తుతున్నది. కాలువలు ద్వారా ప్రవహించే వరద నీరు, మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో ప్రయాణికులు, సందర్శకుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలోనే ఎంతో ప్రాధాన్యత కలిగిన సబ్బవరం మండల కేంద్రంతో ఈ దుస్థితి దాపురించడానికి అధికారులు, ప్రజాప్రతినిధులే కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలో ఆక్రమణలపై స్థానికులు పలుసార్లు సర్వసభ్య సమావేశంలో ఫిర్యాదులు చేసినా, వినతిపత్రాలు అందించినా సంబంధిత అధికారులు పట్టించుకునే పాపానికి పోవడం లేదు.





సబ్బవరం నుంచి అనకాపల్లి వైపు వెళ్లే రోడ్డులో ఆక్రమణకు గురైన ఆర్అండ్‌బీ స్థలం

సబ్బవరం-చోడవరం రహదారిలో వర్షాలు కురిసే సమయంలో పరిస్థితి ఇలా..

జాతీయ స్థాయి ప్రముఖులు వస్తున్నా...

సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి పదేళ్లుగా ఎంతో మంది న్యాయమూర్తులు, వివిధ రాష్ట్రాల నుంచి న్యాయవాదులు, మారిటైం వర్సిటీకి జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు వస్తున్నారు. వారంతా ఈ రహదారి మీదుగానే వచ్చిపోతున్నారు. దుర్గంధపూరిత వాతావరణంతో వారు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధుల్లో చలనం లేకపోతున్నదని స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సబ్బవరం-చోడవరం-అనకాపల్లి రోడ్డులో ఆక్రమణలు తొలగించాలని, రోడ్డుకు ఇరువైపులా మురుగునీరు పోయేలా కాలువలు నిర్మించాలని వారు కోరుతున్నారు.

మురుగు, వరద నీటిలోనే దుకాణాలు

-ఈపు అప్పయ్యమ్మ, ఎరుకునాయుడుపాలెం



మాది ఎరుకునాయుడుపాలెం గ్రామం. అక్కడ నుంచి వచ్చి సబ్బవరంలో పండ్ల దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాను. పంచాయతీకి నెలకు రూ.340 ఆశీలు చెల్లిస్తున్నాను, కానీ మురుగు కాలువ పక్కనే దుకాణం నడుపుకోవాల్సి వస్తున్నది. భరించలేని దుర్గంధం వెదజల్లుతున్నా తప్పడం లేదు. వర్షా కాలంలో వరద నీటిలోనే దుకాణాలు పెట్టుకుంటున్నాం. సీసీ కాలువలు నిర్మిస్తే ఈ సమస్య తప్పుతుందని ఆశిస్తున్నాం.



విద్యుత్ అలంకరణలో అనకాపల్లిలోని పునీత పౌలు కతోలిక చర్చి

సర్వాంగ సుందరంగా చర్చిలు



విద్యుత్ అలంకరణలో సెంటినరీ బాప్టిస్టు చర్చి

అనకాపల్లి టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు చర్చిలు క్రిస్మస్ వేడుకల సందర్భంగా సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. రెండు రోజులుగా పట్టణంలోని పునీత పౌలు కతోలిక దేవాలయం, సెంటినరీ బాప్టిస్టు చర్చి, లూదరన్ చర్చి, మన్నా చర్చి, పెంతుకోస్తల్ చర్చి, ఇమ్మానుయేలు ప్రార్థనా మందిరాలను సర్వాంగ విద్యుత్ అలంకరణలతో సుందరంగా చర్చిల నిర్వాహకులు సిద్ధం చేశారు. పాస్టర్లు భక్తులకు క్రీస్తు పుట్టుక గురించి సందేశాలు అందించారు. రాత్రి 12 గంటల వరకు చర్చిలన్నీ కళకళలాడాయి. విద్యుత్ అలంకరణలతో దగదగ మెరుస్తుండడంతో చర్చిల మీదుగా రాకపోకలు సాగించే వారికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు

రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పరవాడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ అధికారులు తప్పనిసరిగా చర్యలు చేపట్టాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సూచించారు. జీవీఎంసీలోని 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా చూడాలన్నారు. భూములను కబ్జా చేసిన వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రజలకు భూ సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సదస్సులో వివిధ సమస్యలపై 72 అర్జీలు అందుకున్నట్టు తహసీల్దార్ ఎస్‌వీ అంబేద్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, సర్వేయర్ శ్రీనివాసరావు, కూటమి నాయకులు ఎం.శివకుమార్, పి.శివకృష్ణ పాల్గొన్నారు.

ముఠా కార్మికుల భారీ ర్యాలీ



పట్టణంలో ర్యాలీ చేస్తున్న ముఠా కార్మికులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముఠా కార్మికులకు కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు ముఠా కార్మికసంఘం భవనంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు మాట్లాడుతూ ముఠా కార్మికులకు కూలి రేట్ల పెంపుపై ఒప్పందం పూర్తయి 20 రోజులైనా ఇప్పటివరకు సరైన నిర్ణయం తీసుకోలేదని ఆరోపించారు. రెండున్నరేళ్లలో నిత్యావసర సరకుల ధరలు 300 శాతం పెరిగాయన్నారు. అలాగే ఇంటి అద్దెలు, విద్యుత్ బిల్లులు, వైద్య ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కూలి రేట్లను వంద శాతం పెంచాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం మూడు దఫాలు జరిగిన చర్చల్లో పురోగతి లేకపోవడంతో ఈ నెల 26వ తేదీ నుంచి కార్మికులు సమ్మె చేయడానికి నిర్ణయించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ముఠా కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్, అధ్యక్ష, కార్యదర్శులు కాపుశెట్టి అప్పారావు, సురేశ్, నాయుడు, ఈశ్వరరావు, వి.సాయి, బీశెట్టి అప్పారావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరిహారం చెక్కు



వీరశేఖర్ భార్యకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీలోని ఠాగూర్ లేబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో గత నెల 6న విష వాయువులు లీకైన ప్రమాదంలో వీరశేఖర్ మృతి చెందగా, అతని కుటుంబానికి యాజమాన్యం మంజూరు చేసిన రూ.40 లక్షలు పరిహారం చెక్కును ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అందజేశారు. తహసీల్దార్ కార్యాయయంలో మంగళవారం వీరశేఖర్ కుటుంబ సభ్యులకు నగదుకు చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్‌వీ అంబేద్కర్, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, కూటమి నాయకులు కె.వెంకటరమణ, సిహెచ్.ముత్యాలు, బి.శ్రీనివాసరావు, ఎస్.అప్పలనాయుడు, బి.రామగోవిందరావు, ఎం.సన్యాసినాయుడు ఠాగూర్ ఫార్మా ప్రతినిధులు పాల్గొన్నారు.

వినియోగదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శికి ఉత్తమ అవార్డు



ఉత్తమ అవార్డును అందుకుంటున్న రొంగలి రాంబాబు

కొత్తూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా వినియోగదారుల సంఘం ప్రధాన కార్యదర్శి రొంగలి రాంబాబుకు రాష్ట్ర ఉత్తమ అవార్డు లభించింది. విజయవాడలోని తుమ్మపల్లి కళాక్షేత్రంలో మంగళవారం జరిగిన జాతీయ వినియోగదారుల దినోత్సవం కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా రాంబాబు ఈ అవార్డును అందుకున్నారు. కొత్తూరు ప్రాంతానికి చెందిన రాంబాబు అనకాపల్లి జిల్లాలో వినియోగదారుల హక్కులపై పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో ఈ అవార్డుకు ఎంపిక చేశారు.

తప్పుడు ప్రకటనలపై అప్రమత్తంగా ఉండండి

జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి



సదస్సులో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి

అనకాపల్లి టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తప్పుదోవ పట్టించే ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి సూచించారు. స్థానిక రోటరీ క్లబ్ సమావేశం హాలులో వినియోగదారుల రక్షణ చట్టంపై మంగళవారం జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. వినియోగదారుల చట్టం-2019 పరిధిలోకి ఆన్‌లైన్ వినియోగదారులు కూడా వస్తారన్నారు. ఈ-కామర్స్, ఈ-చెల్లింపులపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. నష్టపోయిన బాధిత వినియోగదారులు ప్రశ్నించేతత్వాన్ని పెంచుకోవాలని ఆమె సూచించారు. బాధితులు వినియోగదారుల కమిషన్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చన్నారు. నాణ్యత, సేవల్లోని లోపాలు, అక్రమ వ్యాపారాలపై కూడా కమిషన్‌ను సంప్రదించవచ్చని సూచించారు. బాధితులు నేరుగా లేకుంటే వారి ప్రతినిధుల ద్వారా కూడా ఫిర్యాదు చేసే వెసులుబాటు వినియోగదారుల రక్షణ చట్టంలో ఉందని ఆమె స్పష్టం చేశారు. అయితే కొనుగోలు చేసిన వస్తువులకు బిల్లు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. వినియోగదారుల కమిషన్ల అధ్యక్షులు జి.తనూజరెడ్డి, జి.వెంకటేశ్వరి మాట్లాడుతూ కొనుగోలుదారు ప్రతీ వస్తువుకు బిల్లు తీసుకోవాలని సూచించారు. నగదు చెల్లించి వస్తు సేవల్లో నష్టపోయిన వినియోగదారులకు కమిషన్లు అండగా నిలుస్తాయన్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి కనకమేడల వీఎల్.నరసింహమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఔషధ నియంత్ర, పరిపాలన అసిస్టెంట్ డైరెక్టర్ కె.విజయకుమార్, ఎఫ్ఎస్ఎస్ఏఐ గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కె.సతీశ్‌కుమార్, లీగల్ మెట్రాలజీ పరిశీలకులు డి.భాస్కరరావు, కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు బి.త్రినాథరాజు, సంజీవరావు పాల్గొన్నారు. అనంతరం వినియోగదారుల న్యాయపాలనకు వర్చువల్ విచారణలు, డిజిటల్ సౌలభ్యం అంశంపై జరిగిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు జేసీ బహుమతులను అందజేశారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



మన్నా చర్చిలో నృత్యం చేస్తున్న చిన్నారులు... డైట్‌లో క్రిస్మస్ కేకు కట్ చేస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు చోట్ల సెమీ క్రిస్మస్ వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక దాడి వీరునాయుడు కళాశాలలో కరుణమయుడు ఏసుప్రభువు జన్మదినం సందర్భంగా ఈ వేడుకలను నిర్వహించారు. కళాశాలలో ప్రతీ విద్యార్థికి ఏసు ప్రభువు గొప్పతనాన్ని వివరిస్తూ శాంతి, దయ, కరుణ వంటి గుణాలను అలవర్చుకోవాలని ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేశ్ సూచించారు. ఈ సందర్భంగా కేక కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దయామాధురి పాల్గొన్నారు.

అలాగే బర్మాకాలనీలోని మన్నా చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలంతా క్రిస్మస్ కేకును కట్ చేసి అందరికీ పంచారు. అలాగే చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ అలరించారు. పట్టణంలోని చర్చిలతో పాటు పలువురు ఇళ్లపై క్రిస్మస్ ట్రీ, స్టార్‌ను అందంగా అలంకరించారు. రాత్రి తొమ్మిది గంటల తరువాత క్రైస్తవ కుటుంబాలు చర్చిలకు చేరుకుని ప్రార్థనలు చేశారు.

డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో...

డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు క్రిస్మస్ కేకును కట్ చేశారు. క్రీస్తు శాంతికి, కరుణకు, సేవకు ప్రతీక అని కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ఒక సందేశంలో పేర్కొన్నారు. అందరూ సేవా భావం అలవరుచుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో ఉత్సాహం నింపడానికి ట్రెజర్‌హంట్, స్పాట్ గేమ్‌లను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జె.గణేశ్ ప్రసాద్‌రెడ్డి, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు అనకాపల్లి, పరిసర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం

విశాఖపట్నం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-7 అనకాపల్లి పరిధిలో తుంపాల పంప్ హౌస్ నుంచి అనకాపల్లిలో వివిధ ప్రాంతాలకు వెళ్లే పైపులైను లీక్ అయినందున బుధవారం అనకాపల్లి ప్రాంతాలలో ప్రజలకు తాగునీటికి అంతరాయం కలుగుతుందని నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి పరిధిలోని ఉన్న 6 రిజర్వాయర్లకు మంచినీరు అందించే ప్రధాన పంపు లైన్ 600 ఎంఎం సైజు గల పీఎస్సీ పైపులైను లీక్ కావడంతో మరమ్మతు చేపడుతున్నట్టు తెలిపారు. దీంతో అనకాపల్లి, పరిసర ప్రాంతాలకు తాగునీరు సరఫరా నిలిపి వేస్తున్నట్టు వెల్లడించారు. ఆయా ప్రాంతాలకు ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయనున్నట్టు ఈఈ తెలిపారు. గురువారం యథావిధిగా నీటి సరఫరాను పునరుద్ధరించనున్నట్టు తెలిపారు.

కంపెనీల్లో ప్రమాదాలపై విచారణ చేపట్టాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ కంపెనీల్లో జరుగుతున్న ప్రమాదాలపై సమగ్ర విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఉపాధ్యక్షులు ఆర్.రాము, కోశాధికారి వీవీ శ్రీనివాసరావుతో కలిసి ఆయన మాట్లాడారు. ఫార్మా కంపెనీల్లో ప్రమాదాల నివారణకు ప్రభుత్వ యంత్రాంగం, యాజమాన్యాలు తక్షణ చర్యలు తీసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే జిల్లాలోని వివిధ కర్మాగారాల్లో ఈ నెలలోనే వరుస ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో భద్రతా ప్రమాణాల విషయంలో ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం తేటతెల్లమవుతోందన్నారు. ఈ ప్రమాదాల నివారణ కోసం ముందస్తు జరగాల్సిన సేఫ్టీ ఆడిట్‌లో తీవ్రమైన లోపాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ఫార్మాసిటీలో కార్మికుల భద్రతకు ప్రాధాన్యతనివ్వాలని కోరారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



వెదుళ్లనరవ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

సబ్బవరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదని రీ సర్వే తహసీల్దార్ బి.చిన్నికృష్ణ చెప్పారు. మండలంలోని వెదుళ్లనరవ గ్రామంలో మంగళవారం నిర్వహించిన సదస్సులో రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములకు సంబంధించిన అన్ని సమస్యలు నిర్దేశిత సమయంలో పరిష్కరిస్తామన్నారు. వెదుళ్లనరవలో 22(ఎ) రిజిస్టర్‌లో చేర్చిన భూముల వివరాలను రిజిస్టరు నుంచి తొలగించాలని పలువురు అర్జీలు అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, వీఆర్వో ఎం.గోవిందరావు, సచివాలయ ఉద్యోగులు లోకేష్, రాంబాబు, శివరామకృష్ణ, విజయభాష్కర్, శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

సకాలంలో సర్వేలు పూర్తిచేయండి: ఎంపీడీవో



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో పద్మజ

సబ్బవరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఇంటింటి, ఎంఎస్ఎంఈ, సిటిజన్ మిస్సింగ్ సర్వేలను సకాలంలో పూర్తిచేయాలని ఎంపీడీవో పి.పద్మజ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. నిర్దేశిత సమయంలో సర్వేలు పూర్తి చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా అమలు జరిగేలా చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. రికార్డులు నిర్వహణ పక్కాగా ఉండాలని, క్షేత్ర స్థాయికి వెళ్లి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏవో శివప్రసాద్ నారాయణరావు, ఈవోపీఆర్‌డీ బి.చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ పట్టణ కార్యవర్గం

కొత్తూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ అనకాపల్లి పట్టణ శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశంలో పట్టణ శాఖ అధ్యక్షుడిగా దాడి అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శిగా గొర్లి అర్జునతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం రెండేళ్ల పాటు బాధ్యతలు నిర్వహిస్తుందని గౌరవ అధ్యక్షుడు బుద్ద కాశీ విశ్వేశ్వరరావు తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

కశింకోట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీపీఎన్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. పరీక్షల్లో అత్యధిక ఉత్తీర్ణత శాతం పెంచుకునేందుకు ఈ స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగడుతుందని ప్రధానోపాధ్యాయుడు అప్పారావు చెప్పారు.

నేడు కనకమహాలక్ష్మి అమ్మవారి సారె ఊరేగింపు

కశింకోట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గవరపేటవీధిలో బుధవారం కనకమహాలక్ష్మి అమ్మవారి సారె ఊరేగింపు జరుగుతుందని ఉత్సవ కమిటీ చైర్మన్ భీశెట్టి కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా సాయంత్రం అమ్మవారికి సారె సమర్పించి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. అలాగే గురువారం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. అమ్మవారి ఉత్సవాన్ని భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

ఫార్మా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

పరవాడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫార్మా పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మంగళవాం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎలాంటి భద్రతా ప్రమాణాలు చేపట్టకపోవడంతో ఇటీవల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల సైతం తూతూమంత్రంగా తనిఖీలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారని ఆయన ఆరోపించారు. రక్షిత్ డ్రగ్స్ పరిశ్రమలో ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

పరుపుల కంపెనీలో తప్పిన ప్రమాదం

కొత్తూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక వల్లీ పరుపుల కంపెనీలో మంగళవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వల్లీ పరుపుల తయారీ కేంద్రంలో బయట వైపు గేటు ఏర్పాటు చేసేందుకు వెల్డింగ్ పనులు చేస్తుండగా, ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న కవరుకు నిప్పంటుకుంది. ఈ ప్రమాదాన్ని గమనించిన నిర్వాహకులు మంటలను ఆర్పి వేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని నిర్వాహకుడు తెలిపారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

సబ్బవరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మీ చెప్పారు. కళాశాలలో మంగళవారం నిర్వహించిన వినియోగదారుల దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ వినియోగదారుల హక్కులపై భారత ప్రభుత్వం తీసుకొస్తున్న వివిధ రకాల చట్టాలపైన పూర్తి స్థాయి అవగాహన ఉండాలని సూచించారు. ముఖ్యంగా కామర్స్ విద్యార్థులు వీటి గురించి తెలుసుకోవాలని చెప్పారు. కామర్స్ విభాగాధిపతి ఎం.గోవిందరావు మాట్లాడుతూ భారత ప్రభుత్వం వినియోగదారుల చట్టం-2018 ప్రకారం ప్రత్యేక హక్కులు, న్యాయపరమైన విధానాలను కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బి.లక్ష్మి, డాక్టర్ ఎస్.సత్యనారాయణ, ఎంవీ.రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టిడ్కో ఇళ్లల్లో అసంపూర్తిగా వసతులు

బ్యాంకు రుణాలపై వడ్డీ భారం


బయపురెడ్డిపాలెంలో అసంపూర్తిగా వాటర్ ట్యాంక్ పనులు

నర్సీపట్నం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో టిడ్కో గృహాల లబ్ధిదారుల పరిస్థితి అయోమంగా తయారైంది. ఎనిమిదేళ్లయినా సొంత ఇంటి సాకారం నెరవేరలేదు. గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నప్పుడు బలిఘట్టం దత్తాత్రేయ ఆశ్రమం సమీపంలో, కొత్త బయపురెడ్డిపాలెం- కసిమి రోడ్డులో టిడ్కో గృహసముదాయం నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. మొత్తం 2,448 ప్లాట్లు నిర్మించాలని ప్రణాళిక రూపొందించారు. టీడీపీ హయాంలో 60 శాతం ఇళ్ల నిర్మాణం పూర్తయ్యింది. నాడు మంత్రిగా వున్న అయ్యన్నపాత్రుడు 1,480 మందికి పట్టాలు అందజేశారు. తరువాత వైసీపీ అధికారంలోకి రావడంతో పనులు ఆగిపోయాయి. మిగిలిన 968 మంది పట్టాలు ఇచ్చారు. కానీ వీరిలో 624 మంది పట్టాలను రద్దు చేశారు. చివరకు 1,824 మందికి టిడ్కో ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించారు. టీడీపీ హయాంలో నిర్మాణం పూర్తయిన భవనాలకు వైసీపీ జెండా రంగులు వేయడం మినహా మూడేళ్ల వరకు పనులు మాత్రం చేయలేదు. తరువాత పనులు పునరుద్ధరించినప్పటికీ బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కావడంతో పనులు నెమ్మదించాయి. కసిమి రోడ్డులోని గృహసముదాయంలో మూడు బ్లాకుల పనులు ఇంకా పూర్తికాలేదు. బిల్లులు మంజూరు కాకపోవడంతో అప్పటి నుంచి కాంట్రాక్టర్ పనులు ఆపేశారు.

అసంపూర్తిగా మౌలిక సదుపాయాలు

బలిఘట్టంలో వాటర్ ట్యాంకులు, సెప్టిక్ ట్యాంకులు, రోడ్లు, డ్రైనేజీ కాలువలు, విద్యుత్ పనులు పూర్తి కాలేదు. వరహా నది వంతెన దగ్గర నుంచి గృహ సముదాయానికి రోడ్డు నిర్మించాల్సి ఉంది. కసిమి రోడ్డులోని గృహసముదాయానికి ప్రధాన రహదారిని కలుపుతూ అప్రోచ్ రోడ్డు నిర్మించాలి. మురుగునీటి శుద్ధి ప్లాంట్, సెప్టిక్ ట్యాంకులు, వాటర్ ట్యాంక్‌లు నిర్మించలేదు. ఈ రెండు గృహసముదాయాలకు ఉత్తర వాహిని వద్ద వరహా నది నుంచి తాగునీటి సరఫరాకు పైప్‌లైన్ వేయాల్సి వుంది.

రుణాలపై వడ్డీ భారం

లబ్ధిదారుల్లో దాదాపు వెయ్యి మంది వరకు బ్యాంకుల నుంచి గృహ రుణాలు పొందారు. ఆరేళ్లయినా సొంతి ఇల్లు సమకూరకపోవడంతో బ్యాంకు రుణాలకు వడ్డీలు పెరిగిపోతున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రుణాల వాయిదాలు చెల్లించాలని బ్యాంకు అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వం ఇళ్లు అప్పగించకుండా రుణ వాయిదాలు ఎలా చెల్లిస్తామని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి టిడ్కో గృహసముదాయాల్లో మౌలిక వసతుల పనులు పూర్తిచేసి ప్లాట్లను అప్పగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

పరవాడలో అరకొరగా...


పరవాడలో టిడ్కో గృహ సముదాయం

పరవాడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా పోలీస్ స్టేషన్ సమీపంలో 2018వ సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం టిడ్కో గృహ సముదాయ నిర్మాణాన్ని ప్రారంభించింది. ఒక్కో బ్లాక్‌లో 32 ప్లాట్ల చొప్పున 16 బ్లాకుల్లో 512 మందికి ఇళ్ల కేటా యించారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చేనాటికి 60 శాతం పనులు పూర్తయ్యాయి. తరువాత చాలా నెలలపాటు పనులు ఆగిపోయాయి. ఎట్టకేలకు ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి గత ఏడాది డిసెంబరులో లబ్ధిదారులకు అప్పగించారు. పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రస్తుతం 400 కుటుంబాలు మాత్రమే నివాసం వుంటున్నాయి. ప్రధాన రహదారి నుంచి టిడ్కో కాలనీలోకి రావడానికి పక్కా రోడ్డు నిర్మించలేదు. స్ట్రీట్ లైట్లు వేయకపోవడంతో చీకటిపడితే అంధకారం నెలకొంటున్నది. డ్రైనేజీల్లో పూడిక, చెత్తకుప్పలు పేరుకుపోయాయి.

మంత్రిపాలెంలో మౌలిక వసతులు నిల్

» ఇళ్లల్లోకి దిగని లబ్ధిదారులు


పనులు పూర్తికాని సెప్టిక్ ట్యాంకు

లంకెలపాలెం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పరవాడ మండలం మంత్రిపాలెం వద్ద 2018లో టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఒక్కో బ్లాకులో 48 ప్లాట్ల చొప్పున ఏడు బ్లాకుల్లో 336 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చేనాటికి 60 శాతం పనులు పూర్తి చేశారు. వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించక పోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. గత ఏడాది మరో 30 శాతం పనులు పూర్తి చేశారు. ఎనిమిది నెలల నుంచి పనులు జరగడంలేదు. ఇళ్లకు విద్యుత్ వైరింగ్, తాగునీరు, సెప్టిక్ ట్యాంకు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. డ్రైనేజీ కాలువలు పూర్తిస్థాయిలో నిర్మించలేదు. అయినాసరే గత వైసీపీ పాలకులు ఎన్నికల ముందు లబ్ధిదారులకు హడావిడిగా ఇళ్లను పంపిణీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ ఒక్కరు కూడా నివాసం వుండడంలేదు. మూడు నెలల్లో పనులు పూర్తి చేసి ప్లాట్లను లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకువస్తామని గృహనిర్మాణ శాఖ ఈఈ సుధాకర్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ఎలమంచిలి టిడ్కో కాలనీలో కొరవడిన సదుపాయాలు

432 మందికిగాను ప్రస్తుతం 250 మంది మాత్రమే నివాసం


పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలకు నోచుకోని ఎలమంచిలి టిడ్కో ఇళ్లు


ఎలమంచిలి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామ్‌నగర్ ప్రాంతంలో నిర్మించిన టిడ్కో గృహసముదాయంలో మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించకుండానే గత వైసీపీ ప్రభుత్వం హడావిడిగా లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ చేసింది. భవన నిర్మాణ, ప్లంబింగ్ పనులు నాసిరకంగా వుండడంతో లీకేజీలు అధికమయ్యాయి. సరైన రహదారులు లేవు. విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి. రక్షిత తాగునీటి సరఫరా లేదు. వాడుక నీటి కోసం ఎనిమిది బోర్లు వేసి నాలుగు మోటార్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వీటిల్లో రెండు మాత్రమే పనిచేస్తున్నాయి.

ఎలమంచిలి మునిసిపాలిటీ పరిధి రామ్‌నగర్ సమీపంలో 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం టిడ్కో గృహసముదాయ నిర్మాణ పనులు ప్రారంభించింది. 608 మంది పేదలకు ఇళ్లు మంజూరు చేశారు. 2019 ఫిబ్రవరిలో లాటరీ ద్వారా ప్లాట్లు కేటాయించారు. మూడు నెలల తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణ పనులను నిలిపివేసింది. రెండు బ్లాకులను రద్దు చేసింది. అనర్హుల పేరుతో 80 మంది పట్టాలను సైతం రద్దు చేసింది. మిగిలిన బ్లాకుల నిర్మాణ పనులను రెండేళ్లపాటు పట్టించుకోలేదు. తరువాత పనులు మొదలుపెట్టినప్పటికీ మందకొడిగా సాగాయి. లబ్ధిదారులను 528 నుంచి 432కి కుదించింది. ఏడాదిన్నర క్రితం నిర్మాణ పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించారు. కానీ పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించలేదు. తాగునీటి సరఫరా కోసం పైపులైన్లు వేయలేదు. భూగర్భ జలాల వినియోగం కోసం ఎనిమిది బోర్లు వేశారు. నాలుగు బోర్లుకు మాత్రమే మోటార్లు బిగించారు. వీటిలో రెండు మాత్రమే పనిచేస్తున్నాయి. బోర్లు నీరు తాగడానికి పనికిరాదు. సుమారు కిలో మీటరు దూరంలో వున్న మరో కాలనీకి వెళ్లి కొళాయిల నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. కాలనీ నుంచి ప్రధాన రహదారికి మట్టి రోడ్డు మాత్రమే వుంది. ఈ సమస్యల కారణంగా 432 మందికిగాను ప్రస్తుతం 250 మంది మాత్రమే నివాసం ఉంటున్నారు.

సత్యనారాయణపురంలో 20 శాతం మందే నివాసం

కొత్తూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలోని పేదల కోసం సత్యనారాయణపురం పంచాయతీలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2,764 టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. 2019 ఎన్నికలనాటికి 80 శాతం పనులు పూర్తయ్యాయి. అప్పటికే లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పనులు ఆపేశారు. టీడీపీ హయాంలో నిర్మించిన బ్లాకులకు వైసీపీ జెండా రంగులు వేసుకున్నారు. రాజకీయ కక్షతో పలువురు లబ్ధిదారులను అనర్హులుగా ప్రకటించి ఇళ్లను రద్దు చేశారు. స్థానికులు కొంత మందితోపాటు విశాఖ దక్షిణ నియోజకవర్గానికి చెందిన వారికి కొత్తగా గృహాలు కేటాయించారు.


సత్యనారాయణపురం టిడ్కో కాలనీకి వెళ్లే మట్టి రోడ్డు


గ్రిల్ బిగించని మరుగుదొడ్డి కిటికీ


శ్లాబ్ నుంచి లీక్ అవుతున్న నీరు

తాగునీరు, వీధి లైట్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించకుండానే సుమారు ఏడాది క్రితం లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించారు. ప్రధాన రహదారి నుంచి కాలనీలోకి రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. నిర్మాణ పనుల్లో నా ణ్య తా లోపాలతో గోడలు, శ్లాబ్ నెర్రెల్చి వర్షం కురిస్తే కారిపోతు న్నాయి. ప్రస్తుతం 500 కుటుం బాలు మాత్రమే నివాసం వుంటు న్నాయి. తుప్పలు విపరీతంగా పెరిగిపోయి పాములు సంచరిస్తు న్నాయని లబ్ధిదారులు చెబుతున్నారు.

గత టీడీపీ హయాంలోనే 90 శాతం పనులు పూర్తి

» ఐదేళ్ల పాలనలో గాలికొదిలేసిన వైసీపీ


సిరసపల్లిలో టిడ్కో ఇళ్లు... ఐదేళ్ల నుంచి ఇదే పరిస్థితి

అనకాపల్లి రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ)లో విలీనమైన కొప్పాక, రాజుపాలెం, వల్లూరు, ఎరుకువానిపాలెం పంచాయతీల్లోని పేద వర్గాల కోసం 2018లో నాటి టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టింది. కొండకొప్పాకలోని సుబ్రహ్మణ్యం కాలనీలో 504 గృహాలు, సిరసపల్లిలో 432 ఇళ్లు.. మొత్తం 936 ప్లాట్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.52 కోట్లు మంజూరు చేసింది. 2019 ఎన్నికల నాటికి 90 శాతం పనులు పూర్తయ్యాయి. 800 మంది లబ్ధిదారులు వాటా సొమ్ము చెల్లించడంతో గృహనిర్మాణ శాఖ అధికారులు లాటరీ పద్ధతిలో డ్రా తీసి ప్లాట్లు కేటాయించారు. కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించే తరుణంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ పనులు పూర్తిచేయలేదు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	93.00
లైవ్ ధర	113.00
విత్ స్కిన్	196.00
స్కిన్ లెస్	206.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604

విషాదం

» దైవ దర్శనానికి వెళుతుండగా ప్రమాదం
» విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు
» శ్రీకాకుళం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో విశాఖకు చెందిన తల్లీ, కుమార్తె మృతి
» మరొకరు కూడా...


ప్రమాద దృశ్యం. (ఇన్‌సెట్‌లో) నేహా గుప్తా (ఫైల్ ఫొటో)

కంచిలి (శ్రీకాకుళం జిల్లా), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఒక్కగానొక్క కుమార్తెకు పట్నా ఐఐటీలో సీటు రావడంతో కుటుంబ సభ్యులంతా సంతోషంగా సోమవారం రాత్రి కేక్ కట్ చేశారు. ఆ తర్వాత దైవదర్శనం కోసం కారులో ఒడిశా బయలుదేరినవారు... శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం చిన్న కొజ్జిరియా కూడలి వద్ద ప్రమాదం బారినపడ్డారు. ఈ ప్రమాదంలో తల్లీ, కుమార్తె సహా ముగ్గురు మృతిచెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదానికి సంబంధించి కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

విశాఖ నగరంలోని సీతమ్మధారకు చెందిన ముత్తా వెంకటరంగ రాజేష్ గుప్తా కుమార్తె నేహా గుప్తా(18)కు పట్నా ఐఐటీలో సీటు వచ్చింది. దీంతో రాజేష్, ఆయన భార్య లావణ్య (43), కుమార్తె నేహాగుప్తా, తల్లి సుబ్బలక్ష్మి, తెలంగాణ రాష్ట్రం భద్రాచలానికి చెందిన రాజేష్‌గుప్తా తోడల్లుడు కదిరిశెట్టి సోమేశ్వరరావు (49), మరదలు రాధిక సోమవారం రాత్రి బీచ్‌లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఇంటికి చేరుకున్నారు. వీరంతా మొక్కు తీర్చుకునేందుకు మంగళవారం వేకువజామున ఐదు గంటలకు విశాఖపట్నం నుంచి కారులో ఒడిశా రాష్ట్రం జాజ్‌పూర్‌లోని తరిణి మాత దేవాలయానికి బయలుదేరారు. వారి వాహనం ఉదయం తొమ్మిది గంటల సమయంలో కంచిలి మండలం చిన్న కొజ్జిరియా సమీపంలోకి వచ్చేసరికి అదుపుతప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొని బోల్తా పడింది. ఘటనా స్థలంలోనే లావణ్య మృతిచెందింది. మిగిలిన క్షతగాత్రులను స్థానికులు 108 వాహనం, హైవే అంబులెన్స్‌లో సోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మార్గమధ్యంలో నేహా గుప్తా, సోమేశ్వరరావు మృతిచెందారు. రాధిక పరిస్థితి విషమంగా ఉండడంలో ఆమెను శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవ్ చేస్తున్న రాజేష్ గుప్తాకు, అతని తల్లి సుబ్బలక్ష్మికి స్వల్పగాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల మృతదేహాలను చూస్తూ రాజేష్ రోదిస్తున్న తీరు అందరినీ కలచివేసింది. లావణ్య, నేహా గుప్తా, సోమేశ్వరరావుల మృతదేహాలను సోంపేట ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

వైసీపీ నిర్లక్ష్యం.. పేదలకు శాపం!

... 5వ పేజీ తరువాయి

కాలనీలోకి సిమెంట్ రోడ్డు నిర్మించలేదు. మట్టి రోడ్డులో నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి. రక్షిత తాగునీటి సదుపాయం లేదు. వాడుక నీటి కోసం ఎనిమిది బోర్లు వేసి నాలుగు మోటార్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వీటిల్లో రెండు మాత్రమే పనిచేస్తున్నాయి. బోర్లు నీరు తాగడానికి పనికిరాదు. సమీపంలో వున్న మరో కాలనీకి వెళ్లి కొళాయిల నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. పూర్తిస్థాయిలో వసతులు లేకపోవడంతో 432 మందికిగాను ప్రస్తుతం 250 మంది మాత్రమే నివాసం ఉంటున్నారు. నర్సీపట్నం మునిసిపాలిటీలో టిడ్కో ఇళ్లు ఒక్కటి కూడా లబ్ధిదారులకు అందుబాటులోకి రాలేదు. కసిమి రోడ్డులోని గృహసముదాయంలో మూడు బ్లాకులకు సంబంధించి 144 ప్లాట్ల పనులు ఇంకా పూర్తికాలేదు. బలిఘట్టం గృహసముదాయంలో వాటర్ ట్యాంకులు, సెప్టిక్ ట్యాంకులు, రోడ్లు, డ్రైనేజీ కాలువలు, విద్యుత్ పనులు పూర్తి కాలేదు. ప్రధాన రహదారి నుంచి గృహ సముదాయానికి రోడ్డు నిర్మించలేదు. కసిమి రోడ్డులోని గృహసముదాయానికి ప్రధాన రహదారిని కలుపుతూ అప్రోచ్ రోడ్డు నిర్మించాలి. మురుగునీటి శుద్ధి ప్లాంట్, సెప్టిక్ ట్యాంకులు, వాటర్ ట్యాంక్‌లు నిర్మించలేదు. ఈ రెండు గృహసముదాయాలకు వరహా నది నుంచి తాగునీటి సరఫరాకు పైప్‌లైన్ వేయాల్సి వుంది.

పరవాడ పోలీస్ స్టేషన్ సమీపంలోని టిడ్కో కాలనీలో 512 మందికి గత టీడీపీ హయాంలోనే ఇళ్లు కేటాయించారు. వైసీపీ అధికారంలోకి వచ్చేనాటికి 60 శాతం పనులు పూర్తయ్యాయి. తరువాత చాలా నెలలపాటు పనులు చేయలేదు. ఎట్టకేలకు ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి గత ఏడాది డిసెంబరులో లబ్ధిదారులకు అప్పగించారు. మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో కొద్ది మంది మాత్రమే నివాసరం వుంటున్నారు. పరవాడ మండలం మంత్రిపాలెం వద్ద టిడ్కో గృహసముదాయం పరిస్థితి ఇంతకన్నా దారుణంగా వుంది. ఇళ్లకు విద్యుత్ వైరింగ్, తాగునీరు, సెప్టిక్ ట్యాంకు పనులు పూర్తికాలేదు. డ్రైనేజీ కాలువలు అరకొరగా నిర్మించారు. ప్రస్తుతం ఇక్కడ ఒక్కరు కూడా నివాసం వుండడంలేదు.

ఏరియా ఆస్పత్రిలో గర్భిణి మృతి

... 5వ పేజీ తరువాయి

ఎవరూ పట్టించుకోలేదు. ఉమ్మనీరు పోతున్నదని చెప్పగా, నర్సు వచ్చి చూసి, దేవి చనిపోయిందని చెప్పింది. దీంతో అత్త లక్ష్మి బోరున విలపించింది. భర్త నానాజీ కుప్పకూలి పోయాడు. వైద్యులు అత్యవసర విభాగం వార్డులో ఉంచి వైద్య సేవలు అందించారు. కాగా గర్భిణి దేవి మృతిచెందిన విషయం తెలుసుకుని చినగుమ్మలూరు నుంచి బంధువులు ఏరియా ఆస్పత్రికి వచ్చారు. ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, గైనికాలజిస్ట్ లక్ష్మణరావుతో వాగ్వాదానికి దిగారు. గర్భిణితోపాటు కడుపులో బిడ్డ మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. గైనికాలజిస్టు లక్ష్మణరావు మాట్లాడుతూ, ఉదయం వరకు పేషెంట్ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, ఆకస్మికంగా గుండె ఆగిపోయి మృతిచెందిందని అన్నారు. ఆయన ఇచ్చిన సమాధానంతో సంతృప్తి చెందని బంధువులు.. నైట్ డ్యూటీలో వున్న నర్సుని, డాక్టర్‌ని తమకు అప్పగించాలని, వారితో మాట్లాడతామని అన్నారు. పరిస్థితి అదుపు తప్పుతుండడంతో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ నాగేశ్వరరావు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఉమామహేశ్వరరావు సిబ్బందితో ఆస్పత్రికి వచ్చి ఆస్పత్రి వర్గాలతోపాటు మృతురాలి బంధువులతో మాట్లాడారు. గర్భిణి మృతిచెందడానికి వైద్యుల నిర్లక్ష్యం ఏమీ లేదని, ఆస్పత్రిలో గొడవ చేస్తే రోగులు ఇబ్బంది పడతారని చెప్పారు. దీంతో మృతురాలి బంధువులు వారు శాంతించారు. అనంతరం ఆస్పత్రి అధికారులు అంబులెన్స్ వాహనం ఏర్పాటు చేయగా మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో బ్రాండిక్స్ ఉద్యోగి మృతి


మృతిచెందిన లోవరాజు

అచ్యుతాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమారపురం వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. రాంబిల్లి మండలం హరిపురం గ్రామానికి చెందిన దూలి లోవరాజు (34) ఎస్ఈజడ్‌లోని బ్రాండిక్స్‌లో పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం మొదటి షిఫ్ట్ విధులు ముగిసిన తరువాత ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరాడు. అచ్యుతాపురం-పూడిమడక రోడ్డులో కుమారపురం వద్ద ఆగివున్న బస్సును వెనుక నుంచి ఢీకొన్నాడు. దీంతో రోడ్డుపై పడిపోయిన అతడిని వెనుక నుంచి వస్తున్న మరో బస్సు ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూముల విలువ సవరణ!

... 5వ పేజీ తరువాయి

గజం ధర రూ.18 వేలు, వాణిజ్య సముదాయాల భూమి రూ.40 వేలు ఉండగా వీటిల్లో ఎటువంటి మార్పులు చేయలేదు. వ్యసాయ భూమి ఎకరా రూ.1.1 కోట్ల నుంచి రూ.1.2 కోట్లకు పెంచనున్నారు.

- చోడవరం కార్యాలయం పరిధిలో నివాస స్థలం గజం రూ.2 వేలు ఉండగా రూ.2,500కు, వాణిజ్య సముదాయాల భూమి గజం రూ.5 వేల నుంచి రూ.7 వేలుకు, వ్యవసాయ భూమి ఎకరా రూ.35 లక్షల నుంచి రూ.37 లక్షలకు పెంచనున్నారు.
- కె.కోటపాడు పరిధిలో నివాస భూమి గజం రూ.2,500 నుంచి రూ.3 వేలకు, వాణిజ్య అవసరాల భూమి గజం రూ.3,500 నుంచి రూ.4 వేలకు, వ్యసాయ భూమి ఎకరా రూ.1.7 లక్షల నుంచి రూ.2 లక్షలకు పెంచనున్నారు.
- కోటవురట్ల పరిధిలో నివాస భూమి గజం రూ.650 నుంచి రూ.1,000, వాణిజ్య భూమి గజం రూ.3,500 నుంచి రూ.4 వేలకు పెరగనుంది.
- లంకెలపాలెం పరిధిలో నివాస భూమి గజం రూ.10 వేల నుంచి రూ.12 వేలు, వాణిజ్య భూమి గజం రూ.12 వేల నుంచి రూ.15 వేలకు, వ్యవసాయ భూమి ఎకరా రూ.1.23 కోట్లు నుంచి రూ.1.35 కోట్లకు పెరగనుంది.
- మాడుగుల పరిధిలో నివాస భూమి గజం రూ.2 వేల నుంచి రూ.3 వేలకు, వాణిజ్య భూమి గజం రూ.3 వేల నుంచి రూ.4 వేలకు, వ్యవసాయ భూమి ఎకరా రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెరగనుంది.
- నక్కపల్లి పరిధిలో నివాస భూమి గజం రూ.3 వేల నుంచి రూ.5 వేలు, వాణిజ్య భూమి గజం రూ.7 వేల నుంచి రూ.9 వేలకు, వ్యవసాయ భూమి ఎకరా రూ.18 లక్షల నుంచి రూ.20 లక్షలు ఉండగా దీనిని రూ.24 లక్షల నుంచి రూ.26 లక్షలకు పెంచనున్నారు.
- సబ్బవరం పరిధిలో నివాస భూమి గజం రూ.5,500 నుంచి రూ.7 వేలు, వాణిజ్య భూమి రూ.6 వేల నుంచి రూ.8 వేలకు, వ్యవసాయ భూమి ఎకరా రూ.63 లక్షల నుంచి రూ.83 లక్షలకు పెరగనున్నది.
- నర్సీపట్నం పరిధిలో నివాస భూమి గజం రూ.5 వేల నుంచి రూ.6 వేలు, వాణిజ్య భూమి రూ.8 వేల నుంచి రూ.9 వేలకు, వ్యవసాయ భూమి ఎకరా రూ.40 లక్షల నుంచి రూ.45 లక్షలకు పెరగనున్నది.
- ఎలమంచిలి పరిధిలో నివాస భూమి గజం రూ.7 వేల నుంచి రూ.7,500, వాణిజ్య భూమి రూ.9 వేల నుంచి రూ.10 వేలకు, వ్యవసాయ భూమి ఎకరా రూ.32 లక్షల నుంచి రూ.35 లక్షలకు పెరగనున్నది.